




# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 23-01-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 114 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## కొవిడ్ టీకాపై భయం తొలగించాలి

### 'వ్యాక్సిన్' అనుభవాలు తెలుసుకున్న ప్రధాని



లఖ్‌నవూ: కరోనా వ్యాప్తి నిరోధానికి తీసుకొచ్చిన టీకాల సమర్థత, భద్రతపై నెలకొన్న భయాలు, అపోహలను పారద్రోలాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో కరోనా టీకా తీసుకున్న లబ్ధిదారులు, వ్యాక్సిన్ వేసే సిబ్బందితో మోదీ నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. వారి నుంచి టీకా అనుభవాలను తెలుసుకున్నారు.

"ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సినేషన్ ప్రక్రియ దేశంలో కొనసాగుతోంది. కరోనా పోరులో ముందున్న ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తొలి దశలో టీకాలు తీసుకుంటున్నారు. టీకా సామర్థ్యంపై డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు చెబితేనే ప్రజల్లోకి గట్టి సందేశం వెళ్తుంది. టీకాపై అపోహలను తొలగించండి' అని మోదీ హెల్త్ వర్కర్లను కోరారు.

**ఈ ఘనత శాస్త్రవేత్తలదే..**

ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలు, శాస్త్రవేత్తలకు ప్రధాని కృతజ్ఞతలు

తరువాయి 2లో..

## వింత వ్యాధిపై సీఎం జగన్ సమీక్ష

### సీఎం ఆదేశాలతో పశ్చిమగోదావరికి వెళ్లిన అధికారులు

### అదుపులో పరిస్థితి : ఆళ్ల నాని



అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా పూళ్లలో వెలుగుచూసిన అంతుచిక్కని వ్యాధి లక్షణాలపై శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సీఎం ఆదేశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యానాథ్ దాస్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కె.భాస్కర్ హుటాహుటిన ఏలూరు బయలుదేరారు. పూళ్లలో నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని ప్రజలెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

**అదుపులో పరిస్థితి: ఆళ్ల నాని**

పశ్చిమగోదావరి: కొమిరేపల్లిలో పరిస్థితి అదుపులోనే ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని తెలిపారు. ఇప్పటివరకు 22 మంది బాధితులు ఆస్పత్రిలో చేరారని.. గ్రామంలో '108' వాహనాలను ఏడు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. 25 మంది ఏఎన్‌మ్‌లు, ఆశావర్కర్లు ఇంటింటికి సర్వే చేస్తున్నారని, రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. "మొన్నటి వరకు రాజకీయాల కోసం దేవుళ్లను లాగారు. జిల్లాలో ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లో ఈ తరహా కేసులు వస్తున్నాయి. ఏదైనా కుట్ర జరిగి ఉండొచ్చని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తాం. ప్రజలెవరూ ఆందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని" మంత్రి ఆళ్ల నాని పేర్కొన్నారు.

## ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.కోటి విరాళం



తిరుమల: తితిదే శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ట్రస్టుకు రూ.కోటి విరాళం అందింది. శాంతా బయోటెక్ ఛైర్మన్ వరప్రసాదరెడ్డి ఈ విరాళాన్ని ఇచ్చారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్న ఆయన.. రంగనాయకుల మండపంలో సంబంధిత డీడీని తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అందజేశారు. నాలుగు రోజుల క్రితం ఎస్వీబీసీ ట్రస్టుకు కర్ణాటకలోని హుబ్బళ్లికి చెందిన డీఆర్ఎన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దినేష్ నాయక్ రూ.1,11,11,111 విరాళమిచ్చారు. ఈవో ఏవీ ధర్మారెడ్డిని కలిసిన దాత ఈ మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

### పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్ కాంతారావు



విజయవాడ: మూడు రోజులుగా కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించామని పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్ కాంతారావు తెలిపారు. ఇప్పటవరకు 360 విద్యాసంస్థలు తనిఖీ చేశామని.. 50 కాలేజీలు, 25 స్కూళ్లపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశామని పేర్కొన్నారు. "ప్రైవేట్ కాలేజీలు కొన్ని ఫీజులు ఎక్కువగా

తరువాయి 2లో..

## సిట్ గడువు పొడిగింపు

### ఫిబ్రవరి 28 నాటికి నివేదిక సమర్పించాల్సిందిగా సిట్‌కు ఆదేశం

అమరావతి: విశాఖ భూముల వ్యవహారంపై సిట్ గడువు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 28 నాటికి ఈ వ్యవహారంపై నివేదిక సమర్పించాల్సిందిగా సిట్‌ను ప్రభుత్వం ఆదేశించింది. 2019 అక్టోబరు 17న విశాఖ, పరిసర మండలాల్లో భూముల కొనుగోళ్ల వ్యవహారంపై ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కోవిడ్ లాక్‌డౌన్‌తో సిట్ కార్య కలాపాలకు ఆటంకం ఏర్పడింది. లాక్‌డౌన్ అనంతరం 2020 జూన్ 10 నుంచి తిరిగి సిట్ దర్యాప్తు కొనసాగుతుంది. ఫిబ్రవరి 28 నాటికి నివేదిక సమర్పించాల్సిందిగా సిట్‌కు ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.త

## నోటిఫికేషన్ విడుదలకు ఎస్ఈసీ సమాయత్తం

### నేడు ఉదయం 10 గంటలకు నిమ్మగడ్డ మీడియా సమావేశం



అమరావతి: ఏపీలో రేపు తొలి దశ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఎన్నికల నిర్వహణపై ఈ సాయంత్రం పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ గిరిజాశంకర్ హాజరుకానున్నారు. తొలి దశలో నిర్వహించే పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లతో పాటు ఏయే జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించాలి.. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై చర్చించనున్నారు.

మరోవైపు నేడు ఉదయం 10 గంటలకు నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

మీడియా సమావేశం ద్వారా తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేయనున్నట్లు సమాచారం.

## శ్రీవారి సేవలో పవన్ కల్యాణ్



తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న

తరువాయి 2లో..

## టీకాల ఎగుమతిని ప్రారంభించిన భారత్





దిల్లీ: దేశీయంగా తయారు చేసిన కొవిడ్-19 వ్యాక్సిన్లను విదేశాలకు ఎగుమతి చేసే ప్రక్రియను భారత్ ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన వాణిజ్య పరమైన అనుమతులు లభించిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ఎగుమతులు ప్రారంభిస్తున్నట్లు భారత విదేశాంగశాఖ కార్యదర్శి హర్ష్‌వర్ధన్ ష్రింగ్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా భారత్ శుక్రవారం బ్రెజిల్, మొరాకో దేశాలకు మొదటి విడత టీకాలను పంపుతోందన్నారు. ఆక్స్‌ఫర్డ్-

తరువాయి 2లో..

## పైలెట్ గ్రామాల రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లను ఆదేశించిన సిసిఎల్ఎ ముఖ్యకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్






విశాఖపట్నం : పైలెట్ గ్రామాల రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిసిఎల్ఎ ముఖ్యకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వై.యస్.ఆర్. జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, జిల్లా జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని డ్రోన్ సహాయంతో రీ సర్వే పనులను ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. కార్స్ బేస్ స్టేషన్లు జిల్లాలో 4 ఏర్పాటు కాగా వీటిలో గల సివిల్ పనులు, ఎరక్షన్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. పంచాయితీలో గల గ్రామ కంఠాలు సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. రీ సర్వే చేయబోతున్న గ్రామాలన్నిటికి ప్యూరిఫికేషన్ ల్యాండ్ ఆఫ్ రికార్డ్స్ ను పూర్తి చేయమని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. ప్రసాద్, ఉప కలెక్టర్ రంగయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




# మాతృభాష ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవాలి




శ్రీకాకుళం : మాతృభాష ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవాలని శాసన మండలి తెలుగు భాషా, సంస్కృతి కమిటి చైర్మన్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ అన్నారు. శాసన మండలి తెలుగు భాషా, సంస్కృతి కమిటి శుక్ర వారం జిల్లాలో పర్యటించింది. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షించుకోవాలన్నారు. తెలుగు భాష గొప్పదని పేర్కొన్నారు. మాతృభాషలో తీపిదనాన్ని, ఔన్నత్యాన్ని, మధురత్వాన్ని మరచిపోరాదని పేర్కొన్నారు. పూర్వ కాలం నుండి తెలుగు భాషకు వైభవం ఉందని, తాళపత్ర గ్రంధాలలో సైతం ఎంతో అమూల్యమైన భాషా సాంస్కృతిక సంపద నిక్షిప్తమై ఉందని పేర్కొన్నారు. తంజావూరులో 2,300 తెలుగు తాళపత్ర గ్రంధాలు ఉన్నాయని చెప్పారు. తాళపత్ర గ్రంధాలను ప్రస్తుత అక్షర రూపంలోకి మార్చుతూ డిజిటలైజేషన్ జరుగుతోందని అన్నారు. మాతృభాషపై పట్టు సాధించాలని తద్వారా అందులో మధురానుభూతిని ఆస్వాదించగలమని అన్నారు. చిన్నప్పటి నుండి మాతృభాషను నేర్చుకోవాలని, కేరళ, తమిళనాడు, కన్నడంలో మాతృభాషకు గొప్ప ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. చిన్నతనం నుంచి ఉన్నత స్థాయి వరకు మాతృభాషపై మమకారం ఉండాలని అన్నారు. శ్రీకాకుళంలో కథానిలయం గొప్ప స్ఫూర్తి అన్నారు. విద్య ద్వారా భాషను నేర్చుకోకపోతే భాష అంతరించిపోయే అవకాశం ఉంటుందని సూచించారు. ఇంగ్లీషు వంటి ఇతర భాషలు నేర్చుకున్నప్పటికి మాతృభాషపై మమకారం విడవరాదని హితవు పలికారు. తెలుగులో ఉన్న గొప్ప గ్రంథాలను డిజిటలైజేషన్ చేయడం ద్వారా రాబోయే తరాలకు గొప్ప వారసత్వ సంపద అందించగలమన్నారు. భాషతో అన్యోన్యత పెరగాలని, తెలుగు సంస్కృతి పరిరక్షణకు కృషి జరగాలని అన్నారు. తెలుగు నేల సంస్కృతి, కళలకు పుట్టినిల్లని పేర్కొంటూ వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పూర్వీకుల నుండి వస్తున్న సంపద అని భవిష్యత్తు తరాలకు అందించాలని అన్నారు. తెలుగు వ్యక్తిగా ప్రతి ఒక్కరూ భాషా, సంస్కృతుల ఔన్నత్యానికి పాటుపడాలని కోరారు. చిన్నప్పటి నుండి భాషపై ఔపోసన పట్టాలని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు వి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కమిటీ శ్రీకాకుళం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గొప్ప సాహితీ, సాంస్కృతిక సంపద ఉందని, ఆధునిక సాంస్కృతిక కేంద్రం ఉత్తరాంధ్ర అని అన్నారు. సాహిత్య ఉద్యమాలు నడిచిన నేల అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు నడిపిన వ్యావహారిక ఉద్యమం మరుపురానిదని పేర్కొంటూ కథానిలయం స్ఫూర్తితో రాజమండ్రిలో నాటక నిలయం ఆవిర్భావం జరిగిందని చెప్పారు. డా.బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాష అభివృద్ధికి కృషి జరగాలని సూచించారు. స్థానిక యాస, జానపద, పొడుపు కథలు, జీవన శైలి తదితర అంశాలపై పరిశోధనలకు ప్రోత్సహించాలని కోరారు. శ్రీకాకుళం వాసి కాళీపట్నం రామారావు రచించిన యజ్ఞం పుస్తకంపై దాదాపు 16 మంది పి.హెచ్.డి కోసం పరిశోధనలు చేయడం గర్వకారణమన్నారు. అండమాన్ నికోబర్, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో శ్రీకాకుళం వాసులు ఉన్నారని, శ్రీకాకుళం వాసులు సాహితీ, సాంస్కృతిక సంపద పరిరక్షణలో అద్వితీయమని అన్నారు. అండమాన్ నికోబర్ లో సీబీఎస్ ఇ పరీక్షలలో సైతం సాంఘిక శాస్త్రం పరీక్షను తెలుగులో రాయుటకు అనుమతి పొందిన ఘనత అచ్చటి తెలుగు వారు సాధించిన విజయమన్నారు. ఉపాధ్యాయులలో సాహితీ కృషి వలురను గుర్తించి ప్రోత్సహించాలని డిఇఓ కు సూచించారు. పుస్తకాలు చదవడం అనేది అలవాటుగా మారాలని, నిత్య కృత్యం కావాలని అన్నారు. 10వ తరగతి లోపు విద్యార్థులను వారి ఆసక్తి మేరకు గ్రూపులుగా విభజించి అనువైన పుస్తకాలను గూర్చి తెలియజేయాలని, వాటిని చదివే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. కస్తూర్బా విద్యాలయంలో మంచి పుస్తకాలు ఏర్పాటు చేయాలని ఏపిసికి సూచించారు. ఏ విద్యార్థి ఎన్ని పుస్తకాలు చదివారో తెలుసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా లభ్యంగా ఉంచాలని తద్వారా ఆసక్తి పెరుగుతుందని అన్నారు.

కమిటి సభ్యులు పి వి ఎన్ మాధవ్, కత్తి నరసింహ రెడ్డి పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ జె నివాస్ మర్యాద పూర్వకంగా కమిటీ ఛైర్మన్ ను కలసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లాలో రూపొందించిన కళింగాంధ్ర దేశ చరిత్ర, శ్రీకాకుళం - ఏ స్టోరీ ఆన్ స్టోన్ పుస్తకాలను ఛైర్మన్ కు, సభ్యులకు అందించారు.

జిల్లా విద్యా శాఖ అధికారి కె.చంద్ర కళ, సాంఘిక సంక్షేమ గురుకులం సమన్వయ అధికారి వై. యశోద లక్ష్మీ, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కమల, సమగ్ర శిక్షా అభియాన్ ఏపిసి పివి రమణ, జిల్లా వృత్తి విద్య అధికారి ప్రకాశరావు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీరాములు పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాష అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.శ్రీరాములు నాయుడు, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, కమిటీ డిప్యూటీ కార్యదర్శి జి.విజయ రాజు, డిప్యూటీ విద్యా శాఖ అధికారి జి.పగడాలమ్మ, ఇంటాక్ కన్వీనర్ కెవిజే రాధా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దుష్ప్రచారాలను త్రిప్పికొట్టాలి

## - వి.డి.యస్ లకు పిలుపునిచ్చిన యస్పి అమిత్ బర్ధార్



శ్రీకాకుళం : జిల్లాలోని దేవాలయాలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న దుష్ప్రచారాలను త్రిప్పికొట్టి, మత విధ్వేషాలను రెచ్చగొట్టే పనులకు పూర్తిగా అడ్డుకట్టవేయాలని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్ధార్ గ్రామ సంరక్షణ దళాలు (వి.డి.యస్), గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక వైశ్యరాజు కన్వెన్షన్ హాలులో గ్రామ దేవాలయాల భద్రతలో భాగంగా గ్రామ సంరక్షణ దళాలు మరియు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సంఘాలతో అవగాహన కార్యక్రమం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా యస్.పి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు చేసి మతవిధ్వేశాలను రెచ్చగొట్టేందుకు కొందరు చూస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి మన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలని గ్రామ సంరక్షణ దళాలు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు యస్.పి పిలుపునిచ్చారు. దాడులను ఎదుర్కోవడమే కాకుండా అందులో ఉన్న వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తూ, సామాజిక మాధ్యమాల్లో వచ్చే దుష్ప్రచారాలను త్రిప్పికొట్టాల్సిన బాధ్యత గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులపై ఉందని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు గ్రామ ప్రజలు, వి.డి.యస్ లు, పోలీసులు భాద్యతగా వ్యవహరించినపుడే దేవాలయాలపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్టవేయగలమని, ఇందుకు పోలీసు శాఖకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని యస్.పి కోరారు. ప్రతీ దేవాలయం, చర్చి, మశీదులలో సి.సి.కెమెరాలతో పాటు పుస్తకాన్ని ఏర్పాటుచేసామని చెప్పారు.

అలాగే గ్రామస్థాయిలో కమిటీలను కూడా ఏర్పాటుచేసిన సంగతిని యస్.పి గుర్తుచేసారు. ప్రతీ కమిటీలో సర్పంచ్ తో పాటు వి.డి.యస్, మహిళా సంరక్షణ కార్యదర్శి, వివిధ మత పెద్దలతో పాటు మహిళా పోలీసు కూడా ఉంటారని పేర్కొన్నారు. గ్రామ మహిళా సంరక్షణ దళాలు వారి గ్రామంలోని మశీదు, చర్చి , దేవాలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎప్పటికపుడు సమావేశాలను ఏర్పాటుచేసుకొని నిత్యం సంరక్షించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలేనని గాంధీజీ పిలుపునిచ్చారని, అటువంటి పట్టుకొమ్మల సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని యస్.పి వివరించారు. ఇది ఒక మంచి కార్యక్రమంగా భావించి, సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. దేవాలయాలపై దాడులు జరిగినపుడు మతవిధ్వేషాలకు తావులేకుండా పోలీసులకు సమాచారం ఇచ్చేలా గ్రామస్తులను చైతన్యపరచాలన్నారు, అనంతరం గ్రామ సంరక్షణ దళాలకు టీ-షర్ట్ లను పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు వావిలపల్లి జగన్నాథం నాయుడు, వి.భార్గవ ప్రసాద్ మాట్లాడుతూ దేవాలయాలపై జరుగుతున్నదాడులను కొందరు ఆకతాయిలు చేసే పనిగా అభివర్ణించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాల వలన సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉందని, కావున దాడులు జరిగిన ప్రదేశంలోని వాస్తవాలను మాత్రమే ప్రజలకు చేరవేయాలని తెలిపారు. గ్రామ సంరక్షణ దళాలు (వి.డి.యస్), గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు నిత్యం తమ పరిధిలోని దేవాలయాలను సంరక్షించుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ పి.సోమశేఖర్, క్రైమ్ అడిషనల్ యస్.పి. టి.పి.విఠలేశ్వర్, టౌన్ డి.యస్.పి యం.మహేంద్ర , పోలీస్ అధికారులు, గ్రామ సంరక్షణ దళాలు (వి.డి.యస్), గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్లకు వారంలో ఒక రోజు సెలవు

### జాయింట్ కలెక్టర్ ఎమ్. వేణుగోపాల్ రెడ్డి

విశాఖపట్నం : నగరంలోని రైతుబజార్లకు వారంలో ఒక రోజు సెలవు మంజూరు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తెలిపారు. రైతుబజార్లలో పరిశుభ్రత, నిర్వహణ నిమిత్తం నగరంలో ఉన్న 11 రైతుబజార్లకు మంగళవారం లేదా బుధవారం సెలవు ఇస్తున్నట్లు చెప్పారు. మంగళవారం నగరంలోని గోపాలపట్నం, కంచరపాలెం, సీతమ్మధార, పెదవాల్తేరు, పెదగంట్యాడ, ములగాడ రైతు బజార్లకు, బుధవారం ఎం.వి.పి.కాలనీ, నరసింహనగర్, మర్రిపాలెం, గాజువాక, పెందుర్తి, స్టీల్ ప్లాంట్, మధురవాడ, రైతు బజార్లకు సెలవు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విధానం ఫిబ్రవరి 1వ తేదీ నుండి అమల్లోకి వస్తుందని రైతులు, వినియోగదారులు గమనించాలన్నారు.

# వైభవంగా శ్రీశ్రీశ్రీ మరిడిమాంబ అమ్మవారి 'ముఖద్వారం' పాదపద్మములు ప్రారంభోత్సవం



ములగాడ: మల్కాపురం గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ మరిడిమాంభ అమ్మవారి ముఖద్వారం..పాదపద్మములను అ్యంతవైభవంగా ప్రారంభించారు. నిర్మాణదాతలు సీనియర్ తెదేపా నాయకులు ములంపాక అప్పారావు, నాగవేణి దంపతులు ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాపురం మరిడిమాంభ అమ్మవారి ఆలయ సమీపం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు చేతులమీదుగా నిర్వహించారు. ఈ సంధర్భంగా గణబాబు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాల ఔన్నత్యాన్ని భావి తారాలకు తెపాలని, గ్రామ దేవతలను గ్రామస్తులు నిత్యం ఆరాధించాలని కోరారు. నిర్మాణ దాతలు మలంపాక అప్పారావు మాట్లాడుతూ ఈ ముఖద్వారాన్ని కీ..శే..ములంపాక అప్పచ్చిపాత్రుడు, యల్లయ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం, పాదపద్మములను కీ.శే. సత్యాల మాకయ్యపాత్రుడుగంగమ్మ దంపతులు కీ.శే.ఉషామ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా 61వార్డు అధ్యక్షుడు మజ్జిసోమేష్, సీనియర్ నాయకులు కాకిపోలిరెడ్డి, వార్డు కార్పోరేటర్ అభ్యర్థిని సర్వసిద్ది శ్రీలక్ష్మి, తెదేపా నాయకులు, కార్యకర్తలు, నిర్మాణదాతలు, సత్యాల మాకయ్యపాత్రుడు కుటుంబ సభ్యులు, మరిడిమాంభ ఉత్సవకమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# కొవిడ్ టీకాపై భయం తొలగించాలిం

తెలియజేశారు. "ప్రజలెవరూ బయటకు రాలేని అత్యవసర పరిస్థితుల్లో మీరు(వైద్య సిబ్బంది) విధులు నిర్వర్తించారు. ప్రజలకు సేవ చేశారు. అందుకే టీకా తీసుకోవడంలో మీరే తొలి హక్కుదారులు. ఇక శాస్త్రవేత్తలు కూడా రేయింబవళ్లు కష్టపడి టీకాలను అభివృద్ధి చేశారు. ఇదంతా శాస్త్రవేత్తల ఘనతే. వారి వల్లే ఈ రోజు మనం రెండు స్వదేశీ టీకాలను అందుబాటులోకి తీసుకురాగలిగాం." అని మోదీ చెప్పుకొచ్చారు.

వ్యాక్సిన్లు ఎప్పుడు తీసుకొస్తారని చాలా మంది తనను అడిగారని మోదీ అన్నారు. అయితే వేగంతో పాటు సమర్థతకే తాము ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. సుదీర్ఘకాలం కఠిన ప్రక్రియ తర్వాతే వ్యాక్సిన్లకు ఆమోదముద్ర వేశామని, టీకాల సమర్థతపై ఎలాంటి అపోహాలు అవసరం లేదని మోదీ తెలిపారు.

# టీకాల ఎగుమతిని ప్రారంభించిన భారత్

ఆస్ట్రాజెనెకా టీకా కొవిషీల్డ్‌ను భారత్‌లో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఉత్పత్తి చేస్తోంది. అతిపెద్ద వ్యాక్సిన్ల తయారీదారుగా పేరొందిన సీరం సంస్థకు ఇప్పటికే అనేక దేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. భారత్‌లో వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాతే ఇతర దేశాలకు ఎగుమతులు ప్రారంభించాలని భారత్ నిర్ణయించింది. తాజాగా పొరుగు, కీలక భాగస్వామ్య దేశాలకు ఔషధ ఉత్పత్తుల సహకారంలో భాగంగా భారత్ ఆరు దేశాలకు వ్యాక్సిన్లను ఉచితంగా సరఫరా చేసిన విషయం తెలిసిందే. కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రపంచానికి భారత్ తన సహకారం ఎప్పుడూ అందిస్తుందన్న ప్రధాని మోదీ మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయని విదేశాంగ కార్యదర్శి హర్ష్‌వర్ధన్ ష్రింగ్లా పేర్కొన్నారు. "ప్రధాని ఆలోచన దృష్ట్యా ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్లు కోరుతున్న దేశాలకు వ్యాక్సిన్లు అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని మన పొరుగు దేశాల నుంచే ప్రారంభించాం" అని ఆయన తెలిపారు. బ్రెజిల్, మొరాకో తర్వాత దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియాలకు కూడా వ్యాక్సిన్లను ఎగుమతి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కరోనా మరణాల్లో అమెరికా తర్వాత బ్రెజిల్ రెండో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో సీరం ఇన్‌స్టిట్యూట్ నుంచి రెండు మిలియన్ల కొవిషీల్డ్ డోసులను తీసుకొనేందుకు ఆ దేశం ఒప్పందం చేసుకుంది.

# అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

వసూలు చేస్తున్నాయి. గతేడాది ట్యూషన్ ఫీజులో 30 శాతం తగ్గించి మాత్రమే ఫీజులు వసూలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వాదేశాలను కొన్ని కార్పొరేట్ కాలేజీలు పట్టించుకోలేదు. కనీస సౌకర్యాలు కూడా లేకుండా అధిక ఫీజులు వసూలు చేశారు.అధిక ఫీజు వసూలు చేసిన కాలేజీలు తిరిగి డబ్బును విద్యార్థులకు ఇచ్చేయాలి. అలా చేస్తే చర్యలు తీసుకోకుండా ఆలోచిస్తామని" ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తే 91502 81111 కాల్ చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. అధిక ఫీజుల వసూలుపై కఠిన చర్యలు తీసుకుంటామని కాంతారావు హెచ్చరించారు.

# శ్రీవారి సేవలో పవన్ కల్యాణ్

జనసేనానికి తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం పలికి శేష వస్త్రంతో సత్కరించారు. తితిదే అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఏడాది నుంచి స్వామివారి ఆశీస్సుల కోసం రావాలనుకుంటున్నట్లు చెప్పారు. కరోనా వైరస్ ప్రభావంతో రాలేకపోయానని.. ఇవాళ స్వామివారి ఆశీస్సులు లభించాయని తెలిపారు. పవన్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్నారు.

# శిక్షణ కలిగిన ఆయుష్ వైద్యులకే శస్త్ర చికిత్సలు



శ్రీకాకుళం, : శస్త్ర చికిత్సలలో శిక్షణ కలిగి ఉన్న ఆయుష్ వైద్యులకే శస్త్ర చికిత్సలకు అవకాశం కల్పించడం జరుగుతుందని రాష్ట్ర ఆయుష్ విభాగం కమీషనర్ పి.ఉషాకుమారి స్పష్టం చేసారు. శ్రీకాకుళంలో జరిగిన మూడు జిల్లాల ఆయుష్ విభాగం వైద్యుల పునశ్చరణ కార్యక్రమానికి హాజరైన కమీషనర్ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాయం వంటి కొన్ని సంస్థల్లో ఆయుష్ విభాగం విద్యార్థులకు శస్త్ర చికిత్సలో శిక్షణా, నిర్వహణ ఉందని అటువంటి శిక్షణ కలిగిన వారికి మాత్రమే శస్త్ర చికిత్సలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ విభాగం వైద్యులకు తర్ఫీదును కల్పిస్తుందని అన్నారు. రాజమండ్రిలో పనిచేస్తున్న ఒక ఆయుష్ విభాగం వైద్యురాలు పైల్స్ శస్త్ర చికిత్సలో ప్రముఖులుగా ఉన్నారని చెప్పారు. ఆయుష్ విభాగంలో అనేక నూతన అంశాలను తీసుకోవడం జరుగుతుందని అందులో వైద్యులకు పునశ్చరణ కార్యక్రమం జరుగుతోందని వివరించారు. జాతీయ ఆయుష్ మిషన్ క్రింద నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. కోవిడ్ సమయంలో ఆర్సెనికా కాల్సికమ్ మందును కోవిడ్ నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో దాదాపు రెండు కోట్ల మందికి పంపిణీ చేసామన్నారు. 420 మంది వైద్యులు కోవిడ్ విధుల్లో పనిచేసారని, శ్రీకాకుళంలో ఇప్పటికి సేవలు అందిస్తున్నారని ఆమె వివరించారు. విశాఖపట్నం ఎండాడలో నేచురోపతి ఆసుపత్రి నిర్మాణానికి మంజూరు జరిగిందని అన్నారు. దేశీయ మందులతో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందుతుందని దీనిని ప్రజలు ఆచరించాలని ఆమె పిలుపునిచ్చారు. జీవన శైలి మార్పులతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని, ఆయుష్ విధానం పాటించడం వలన వ్యాధులకు గురికాకుండా ఉండే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్రంలో 729 ఆయుష్ విభాగం డిస్పెన్సరీలు ఉన్నాయని వాటిలో 559 మంది వైద్యులు పనిచేస్తున్నారని, మిగిలిన పోస్టులు భర్తీకి ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ఆయుష్ విభాగం డిస్పెన్సరీలు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు విధిగా పనిచేయాలని ఆమె స్పష్టం చేసారు. వైద్యులకు లైవ్ లొకేషన్ విధానం ఏర్పాటు చేసామని, దీనిని నాలుగు జోన్లలో నలుగురు అధికారులు పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. ఆయుష్ విభాగం బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద మంజూరైన నిధులతో మందులు కొనుగోళు చేస్తామని ఆమె వివరించారు. శ్రీకాకుళం విచ్చేసిన ఆయుష్ కమీషనర్ కు మూడు జిల్లాల వైద్యులు ఘనంగా సన్మానించారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో ప్రాంతీయ సంచాలకులు వై.శేఖర్, ఆయుష్ సీనియర్ వైద్యులు మాధవ రావు, జగదీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీకి సబ్ కలెక్టర్ రూ.2లక్షలు విరాళం

అమలాపురం : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అమలాపురం సబ్ కలెక్టర్ హిమాన్షు కౌశిక్ రూ.2లక్షలు విరాళాన్ని అందచేశారు.శుక్రవారం అమలాపురం సబ్ కలెక్టర్ కార్యా లయంలో ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం తరపున మెంబర్ షిప్‌గా 2లక్షల రూపాయల విరాళాన్ని డి.డి.రూపంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ద్వారా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డికి అందచేశారుఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యా లయం డివిజనల్ పరిపాలన అధికారి జే.వేంకటేశ్వరి, అమలా పురం మండల తహశీల్దార్ ఠాగూర్ పాల్గొన్నారు.

## సింహాచలం దేవస్థానం ఆలయ

# నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన డి.వెంకటేశ్వరరావు





సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా డి వెంకటేశ్వరరావు శుక్రవారంనాడు స్వామివారి ఆలయ మండపంలో బాధ్యతలు చేపట్టారు. ఆలయ అధికారులు నూతన ఈవో వెంకటేశ్వరరావు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనగరం మానస ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా పనిచేసిన వెంకటేశ్వరను దేవాదాయ శాఖ ఉత్తర్వులు మేరకు సింహాచలం ఈవోగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన ధ్యేయంగా పని చేస్తానన్నారు. దేవస్థానం భూములు అన్యాక్రాంతం జరగకుండా తగు చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఎవరైనా దేవస్థానం భూములు అన్యాక్రాంతం చేస్తే ఉపేక్షించేది లేదని వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని భూములు పరిరక్షణతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని వైదిక వర్గాలు మరియు ఆలయ అధికారులు కిందిస్థాయి సిబ్బంది వేరు వేరు కాదు అందరూ స్వామి వారికి కలిసి పని చేయాలని కోరారు. ఆలయ అధికారులు మరియు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఈవో వెంకటేశ్వరరావు కు శాలువా పుష్పగుచ్ఛం తో ఘనంగా సత్కరించారు.

# విద్యా సంస్థల వాహనాల యాజమాన్యాలు నిబంధనలను పాటించాలి



విశాఖపట్నం : 32 వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉప రవాణా కమిషనర్, మాధవధార, విశాఖపట్నం వారి కార్యాలయంలో స్కూలు బస్సుల యాజమాన్యం మరియు డ్రైవర్లతో అవ గాహన సదస్సు నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమములో డి.టి.సి. రాజ రత్నం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డి.టి.సి రాజారత్నం గారు మాట్లాడుతూ విద్యా సంస్థ వాహనాల యజ మానులు నిబంధనలను తప్పని సరిగా పాటించాలని తెలియజేశారు. విద్యా సంస్థల బస్సులు ఫిట్నెస్ సర్టిఫికేట్ కలిగియుండాలని, అలానే బస్సులలో ఓవర్ లోడ్ చేయకూడదని, బస్సు నడిపే డ్రైవర్లు ఎప్పటికపుడు బి.పి. షుగర్, మరి ఇతర ఆరోగ్య సమస్యల కొరకు తరచూ ఆరోగ్య పరిక్షలు చేయించుకోవాలి. సెల్ ఫోను మాట్లాడుతూ వాహనాన్ని నడుపరాదని, అధిక వేగంతో వాహనాన్ని నడు పరాదని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో....

ఆర్.టి.ఓ కె.వి ప్రకాష్రావు,, మోటారు వాహనముల తనిఖీదారు అనిల్, విద్యా సంస్థల యజమానులు మరియు డ్రైవర్లు మొదలగు వారు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్తంశెట్టి శివనందిస్ పుట్టినరోజు వేడుకలు



భీమునిపట్నం : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తనయుడు ముత్తంశెట్టిశివ నందిస్ కి పుట్టినరోజు సందర్భంగా భీమిలి వై. సి.పి ప్రచార కమిటీ అధ్యక్షుడు పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, ముక్కి కృష్ణ ఆధ్వర్యంలో భీమిలి చిన్న బజార్ జంక్షన్ లో కేక్ కటింగ్ చేసి అందరికీ పంచి పెట్టారుఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం.షణ్ముఖరావు, ఎస్. కరుణాకర్ రెడ్డి, జీరు.వెంకట్ రెడ్డి, అల్లిపిల్లి నర్సింగరావు, కదిరి ఎల్లా జీ, వాసుపల్లి కొండబాబు, అప్పికొండ అప్పలనాయుడు, ఎం రాము, రాంభుక్త ప్రభాకర్ నాయుడు, డింగి దుర్గ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొలితరం కార్టూనిస్టు వేణు మృతి



గోపాలపట్నం : తొలితరం కార్టూనిస్టు లలో ఒకరైన వేణు గరువారం స్వర్గస్తులైనారు ఈ సందర్భంగా నార్తుకోస్టల్ ఆంధ్రా కార్టూనిస్టు ఫోరమ్ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వేణు వేసిన కార్టూన్లు వివిద పత్రికలలో విరివిగా ప్రచురింపబడ్డాయి వేణు ప్రభుత్వబ్యాంకులో పనిచేసి రెండేల్లక్రితమె పదవీవిరమణ చేశారు.

# ఎమ్మెల్యే అమర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ శ్రేణులు



పరవాడ : పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న అనకాపల్లి శాసనసభ్యులు మరియు రాష్ట్రఅధికారప్రతినిధి గుడివాడ అమర్ నాథ్ కు శుక్రవారము మిందిలో గల అయన స్వగ్రహంలో రాష్ట్ర సిఇసిసభ్యులు పైల శ్రీనివాసరావు, వై.ఎస్.ఆర్.సి.పి మండల అధికార ప్రతినిధి బొద్దపు చిన్నారవు, పరవాడ మండల వ్యవసాయసలహకమిటి చైర్మన్ కోనరామారావు, రావాడ వైసిపి గ్రామకమిటి అద్యక్షులు కావలి వాసు,77వ కార్పొరేటర్ అభ్యర్ధి మద్ది శ్రీనివాసరావు, బొండాశ్రీనువాసురావు,తాడి వైసిపి కన్వీనర్ బి.గోవింద్, పెదముషిడివాడ వైసాపి ఎంపిటిసి అభ్యర్ది నందవరపు శ్రీనువాసు రావు, నెల్లి శ్రీనివాసరావు, మండల ఎస్.సి సెల్ ప్రెసిడెంట్ ములకలపల్లి రమనబాబు, తదితరులు అయన కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు. అనంతరము వైసిపి సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు మాట్లడుతూ ఎమ్మెల్యే అమర్ నాథ్ ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరిపికోవాలనీ, రానున్న రోజుల్లో రాజకీయపరంగా ఉన్నతస్దాయికి ఏదుగాలనీ అకాక్షించారు.



అయన ఎమ్మెల్యేగా ఉన్న అనకాపల్లి నియోజకవర్గం అభివృద్ధి వైపు పయనిస్తుంది అని అన్నారు.తండ్రికి తగ్గ తనయుడుగా ఎమ్మెల్యే అమర్ నాద్ అడుగులు వేస్తున్నారు అని ఈసందర్భంగా పైలా అన్నారు.

# అప్పన్న ను దర్శించుకున్న

## వారణాసి కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ మిశ్రా



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని వారణాసి శ్రీ కాశి విశ్వేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ మిశ్రా శుక్రవారం నాడు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలుకగా స్వామివారి దర్శనం చేసుకున్నారు అనంతరం అధికారులు వీరికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఎంతో భాగంగా భావిస్తున్నామని ఎంతో పురాతన మహిమగల ఆలయం అని దేశప్రజలు కరోనా నుండి విపత్తుల నుండి దేశప్రజలు రక్షింప బడాలని రామ మందిర నిర్మాణం దేశప్రజలు ఉడతా భక్తితో ఆలయ నిర్మాణానికి తోడ్పడాలని అన్నారు ఈ సందర్భంగా సింహగిరి కొండపై గల కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని దర్శిం చారు. ఈ సందర్భంగా దేవస్థానం భక్తులకు సేవలం దిస్తున్న సింహాచలం దేవస్థానం పి ఆర్ ఓ తులా రాముడు ను శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయమునందు రుద్రాక్షమాలను బహూకరించి మెమొంటో తో సత్కరించారు.

## నేడు, రేపు మరిడిమాంబ తీర్థ మహొత్సవాలు



దేవరాపల్లి : మామిడిపలి గ్రామంలో ఈనెల 23, 24 తేదీల్లో మరిడిమాంబ అమ్మ వారి తీర్థ మహొత్స వాలు ఘనంగా నిర్వ హించనున్నారు. ఈ సందర్భంగా గ్రామం లో 22, 23 తేదీల్లో ఆహ్వాన క్రికెట్ పోటీలు జరుగు తున్నాయన్నారు.అదే విధంగా 23, 24 తేదీల్లో షెటిల్ టోర్న మెంట్ (ఓపెన్ డబుల్స్ టోర్నమెంట్) పోటీలు జరుగు తాయన్నారు. 24న మధ్యాహ్నం రెండు గంటల నుంచి మహిళా కబడ్డీ పోటీలు, జిల్లా స్థాయి ఎడ్లబండ్ల ప్రదర్శన జరుగు తుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు భారీ నగదు బహుమతులను అందజేయను నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు.



**రాజాం క్యాంపు కార్యాలయం లో శుక్రవారం తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి వర్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గ భాద్యులు గౌరవ కిమిడి కళావెంకట రావుని కలుసు కొని, అక్రమ అరెస్ట్ చేసినందుకు సంఘీభావం తెలిపిన విశాఖ పట్నం తూర్పు నియోజకవర్గ శాసనసభ సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, ఆళ్ల వాసు, కాళ్ళ శంకర, దక్షిణ నియోజకవర్గ నాయకులు వానపల్లి రవికుమార్ (మాజీ కార్పొరేటర్), వానపల్లి సత్య, సారిపల్లి మహేష్, పల్లా రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.**

# విశాఖ భూ కుంభకోణం పై ప్రభుత్వం నియమించిన సిట్ ను రద్దు చేయాలి

- అధికార పార్టీ ఎజెండాతో సాగుతున్న సిట్ విచారణ
- సిట్ విచారణకు హాజరవుతూ అధికార పార్టీ పెద్దలతో నిందితులు మంతనాలు
- ప్రభుత్వం రంగంలోకి దిగి కబ్జాదారుల పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- జన సైనికుడు పీతల మూర్తి యాదవ్ డిమాండ్



విశాఖపట్నం : విశాఖలో పెద్ద ఎత్తున జరిగాయంటున్న భూ కుంభకోణాలపై నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)విచారణ పెద్ద ఫార్స్ గా మారిందని జన సైనికుడు పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. గడువు ముగిసిన తరువాత కూడా ఇప్పటికీ కొనసాగుతున్న విచారణ పట్ల నగర ప్రజలకు నమ్మకం కుదరడం లేదని ఒక ప్రకటన లో తెలిపారు. ఇప్పటివరకు జరిగిన విచారణ లో నిర్ధారణ అయిన అక్రమాలను బహిర్గతం చేసి సిట్ ను రద్దు చేయడం సమంజసం గా ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. విచారణ పేరిట పలువురుని వేధింపులకు గురిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, భూకబ్జా ఆరోపణలున్న అధికార పార్టీ నేతల జోలికి సిట్ వెళ్లటం లేదని విమర్శించారు. ఆరు ఎకరాల భూమి తమ కబ్జాలో ఉందని స్వయంగా అంగీకరించిన అధికార పార్టీ శాసనసభ్యుడు వ్యవహారంపై సిట్ ఇంతవరకు ఎందుకు దృష్టిసారించలేదని ప్రశ్నించారు. వాల్తేర్ క్లబ్ వ్యవహారంలో సిట్ అత్యుత్సాహం ప్రదర్శించిందని, హైకోర్టు మందలింపుకు గురైంది అన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర దాటుతున్నా పాత సిట్ నివేదికను బహిర్గతం చేయడం గానీ కొత్త సిట్ విచారణ ఆధారంగా భూ కబ్జాదారులు పై చర్యలు తీసుకోవడం గానీ జరగ లేదని అన్నారు. దసపల్లా భూములు, వుడా ఓజోన్ వ్యాలీ, ముదపాక ల్యాండ్ పూలింగ్, ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ సైనికులు, రాజకీయ నాయకులు కు కేటాయించిన భూములు, కబ్జాకు గురైన ప్రభుత్వ, వుడా భూములపై సిట్ తీసుకున్న చర్యలు శూన్యమని ధ్వజమెత్తారు. ఎటువంటి చర్యలు లేకుండా కబ్జా లను ఎలా అరికడ తారని ప్రశ్నించారు. ప్రభుత్వం గతంలో నిషేధించిన 22ఎ భూముల అంశం తమ పరిధిలోకి రాదని సిట్ అధికారి ప్రకటించారని. విచారణ నుంచి పలు అంశాలను తప్పించినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సిట్ పేరిట అమాయకులను వేధింపులకు గురి చేయటం, రిటైర్డ్ అధికారులును పోషించడం తప్ప ఫలితం లేదన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవు తోందన్నారు. పాత, కొత్త సిట్ నివేది కలను యథా తథంగా ప్రజల ముందుంచి సిట్ ను రద్దు చేయాలని, ప్రభుత్వమే ప్రత్యక్షంగా రంగంలోకి దిగి భూకబ్జాలు పై చర్యలు తీసుకోవాలని పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో బాలల అదాలత్ లు ఏర్పాటు చేయండి

## - సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గొండుసీతారాం

విశాఖపట్నం : రాష్ట్రంలోని 13 జిల్లాల్లోను ముఖ్యంగా పరిపాలనా రాజధాని కాబోతున్న విశాఖ లో ప్రత్యేక బాలల అదాలత్ లు ఏర్పాటు చేసి బాలలకు,వారి తల్లిదండ్రులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి,రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ ల దృష్టికి తీసుకెళ్లినట్లు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్)రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గొండు సీతారాం తెలిపారు గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఏడాది ఆగస్టు తో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్(ఏ పి ఎస్ సి పి సి ఆర్) గడువు ముగిసిందని గుర్తు చేసినట్టు చెప్పారు,ఈ కమీషన్ లో చైర్ పర్సన్,సభ్యులు నియామకం లేకపోవడం వల్ల రాష్ట్రంలో బాలల సమస్యలు నెలకొన్నాయని అన్నారు,త్వరిత గతిన ఈ కమీషన్ పునరుద్ధరించాలని కోరారు,ఈ కమీషన్ నియామకం వల్ల అధిక శాతం బాలల సమస్యలు పరిష్కారానికి త్వరిత గతిన దిశగా అడుగులు పడే అవకాశాలు ఎక్కువ ఉంటాయని, సమర్థ వంతమైన బాలల హక్కులు, వారి సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తున్న అనుభవజ్ఞులైన వ్యక్తులతో త్వరిత గతిన కమీషన్ ను భర్తీ చేయాలన్నారు,అలాగే జిల్లా, పట్టణ, మండల, గ్రామ స్థాయి బాలల అదాలత్ లు ఏర్పాటు చేస్తే బాలల లైంగిక వేధింపుల కేసులు పరిష్కారం అవ్వడంతో పాటు నిందితు లకు తక్షణమే శిక్షలు ఖరారు చేసే అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.

బాల్య వివాహాలు,బాల కార్మికులు పెండింగ్ సమస్యలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేమి, ఫీజుల వేధింపులు, ఒత్తిడిలు, ఇతర నిర్భంద కాండలు,అంగన్వాడీ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహార, వైద్య సమస్యలు ప్రత్యక్షంగా బహిర్గతమయ్యే అవకాశం కలుగుతుందని అన్నారు

అలాగే అధిక శాతం బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్య క్రమాలు,సమస్యలు ప్రభుత్వాలు, సంభందిత రాజ్యాంగ వ్యవస్థల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చడానికి అవకాశాలు మెరుగు పడతాయని వెల్లడించినట్టు చెప్పారు. ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి తో బాలల ప్రత్యేక అదాలత్ లు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరినట్టు తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## ట్రంపిజం మధ్య కొత్త పయనం

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నాలుగేండ్ల పదవీకాలం ముగిసింది. కానీ దేశంలో ఆయన గీసిన విభజన రేఖలు పూర్తిగా చెరిగిపోవడానికి ఎంతకాలం పడుతుందో తెలియదు. కొత్త అధ్యక్షుడిగా వచ్చిన జో బైడెన్ ముందు ఈ విభజిత అమెరికా సమాజాన్ని కలపడం ఎలా అనే సమస్య ప్రధానమైంది. ట్రంప్ పరిపాలన ముగిసింది కానీ ట్రంపిజం ఇంకా బతికే ఉంది. వచ్చే నాలుగేండ్లు జో బైడెన్‌తోపాటు అమెరికా ప్రజలను ఇది వెంటాడుతూనే ఉంటుంది. సమాజాన్ని విభజించడం చాలా సులువు, కానీ కలపడం అత్యంత కష్టసాధ్యం. అమెరికా సమాజం ఈ సవాళ్లను ఎదుర్కోవలసి ఉంది.

సవాళ్లలో చాలావాటిని ఎదుర్కొనే సత్తా కొత్త అధ్యక్షుడైన 78 ఏండ్ల జో బైడెన్‌కు ఉందని చెప్పడానికి ఆయన సుదీర్ఘమైన పాలనా అనుభవం ఒక గీటురాయి. కానీ ట్రంపిజం వల్ల అవాంఛనీయ ప్రతికూల పరిణామాలు సంభవించే అవకాశమూ ఉంది. మొత్తంగా అమెరికాను అగ్రరాజ్యంగా నిలపడానికి చేసే ప్రయత్నం కొత్త అధ్యక్షుడికి కత్తి మీద సాము లాగానే ఉంటుంది.

రెండు వందల సంవత్సరాల ఆదర్శ ప్రజాస్వామ్య రాజ్యం అమెరికా. లిబరల్ డెమోక్రాటిక్ సిద్ధాంతంతో పని సంస్కృతి ఉన్న సమాజం. ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్షిప్, వైవిధ్య భరిత స్వేచ్ఛాయుత వాణిజ్యం ఇవన్నీ అమెరికా సమాజంలోని లక్షణాలు. ఆ దేశ ప్రజాస్వామ్య విధానాలు కొన్ని ఇప్పటికీ చాలా దేశాలకు అనుసరణీయం. అలాంటి ఘనచరిత్రకు 45వ అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్ మచ్చ తెచ్చేలా వ్యవహరించారు. ప్రపంచానికే ప్రజాస్వామ్య పాఠాలు చెప్పే అమెరికా తలదించుకునేలా ప్రవర్తించారు. పదవి నుంచి దిగిపోయేటప్పుడు కూడా కొత్త అధ్యక్షుడిని వైట్‌హౌస్‌లోకి స్వాగతించే కనీస మర్యాదను పాటించలేదు. అమెరికా మాజీ అధ్యక్షుడు రీగన్ ప్రారంభించిన సంప్రదాయం.. కొత్త అధ్యక్షుడికి సూచనలు సలహాలు ఇస్తూ రాసే లేఖను కూడా దొంగతనంగా తన సొరుగులో పెట్టి వైట్‌హౌస్ నుంచి పలాయనమయ్యారు.

ట్రంప్ రాజకీయ పరిణతి లేకుండా తీసుకున్న చాలా చర్యలు సమాజాన్ని కలపడం కాకుండా విడదీశాయి. అనేక వ్యవస్థలను ఆయన ధిక్కరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు నిధులు ఆపేశారు. తన పాలనలో అత్యంత వికృతంగా ప్రవర్తించారు. మాస్క్‌ను పూర్తిగా పెట్టుకోలేదు. వ్యాక్సిన్ విషయంలో కూడా అనేక రాజకీయాలు చేశారు. హింసకు వ్యతిరేకంగా మాట్లాడుతూనే హింసను ప్రోత్సహించారు. చివరి మూడు నాలుగు నెలల పదవీకాలంలో మరిన్ని తప్పులు చేశారు. ఆయన చేసిన మరిన్ని చెడ్డ పనుల గురించి చెప్పుకోవాలంటే చాట భారతమే అవుతుంది. మన దేశంలో కుల మతాల ధోరణి ఎలా ఉందో అమెరికాలో కూడా తెల్ల జాతి వర్ణ అహంకారం అలాగే ఉంది. ట్రంప్ ఈ ఆధిపత్య భావనను ఉపయోగించుకొని అమెరికా సమాజంలో చీలికలు తీసుకువచ్చారు. తెల్లజాతి క్రైస్తవులకు తాము మైనార్టీలో పడిపోతామనే భయాన్ని, వారిలో ఒక రకమైన అభద్రతాభావాన్ని సృష్టించారు. ఇక రెండో విషయం ఆర్థికపరమైనది. తమ తల్లిదండ్రుల కంటే తమ ఆదాయం పడిపోతుందేమో అన్న భయం, తమ పిల్లలకు ఇంకా తక్కువ వస్తుందేమోననే భయం వారిని వెన్నాడింది. దీనితో ఇప్పటిదాకా అమెరికాలో ఎప్పుడో రెండు మూడు తరాల కింద వెళ్లి సెటిల్ అయినవారు కూడా ట్రంప్‌నకు మద్దతిచ్చారు.

జనవరి 20న అమెరికా 46వ అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తూ తన మొదటి ప్రసంగంలో.. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రజలను ఐక్యంగా ఉంచుతానన్న జో బైడెన్ మొదటి మాటే ఆయనకు మొదటి సవాలుగా మారనుంది. విభజిత అమెరికా సమాజాన్ని కలిపే పని మొదట చేయాలి. విదేశాంగ విధానం విషయంలో ఇప్పటికిప్పుడు చేసే మార్పులు ఏమీ కనిపించకపోయినా చైనాతో వ్యతిరేకత కొనసాగిస్తారా లేదా సఖ్యత సాధిస్తారా అన్నది వేచిచూడాలి. ఎందుకంటే ట్రంప్ అమెరికా ప్రజలను చైనాకు వ్యతిరేకంగా తయారుచేసి పెట్టారు. అందువల్ల బైడెన్ తాత్కాలికంగానైనా చైనాకు వ్యతిరేకంగా మాట్లాడాల్సి వస్తుంది. ఇక అమెరికా ఆర్థికరంగం కుదేలైపోయింది. కొవిడ్ 19 సందర్భంగా ప్రకటించిన ఉద్దీపన పథకాలు ఒకరకంగా ఆర్థిక సంక్షోభానికి దారితీశాయి. ఇప్పటికే డాలర్ల ముద్రణ విపరీతంగా పెరిగిపోయింది. ఉత్పత్తి లేకుండా డాలర్లు ముద్రించడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. ఈ ఆర్థిక మాంద్యాన్ని తట్టుకోవడానికి జో బైడెన్ ఏం చేస్తారని ప్రపంచం చూస్తున్నది. చైనాతో పోల్చుకుంటే అమెరికా ఉత్పత్తి రంగంలో వెనుకబడింది.

ప్రపంచంలో నంబర్ వన్‌గా తన స్థానం నిలబెట్టుకోవాలంటే అమెరికా ఉత్పత్తి రంగంలో పెనుమార్పులు చోటుచేసుకోవాలి.

# తాగునీటి పైపులైన్ కు శంకుస్థాపన

## ప్రతి ఇంటికి నాణ్యమైన రేషన్ బియ్యం డోర్ డెలివరీ

## రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు




భీమునిపట్నం: జివిఎంసి. భీమిలీ జోన్ పరిధిలోని గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తగరపువలస వెంకటేశ్వర మెట్ట వద్ద 1800 కేఎల్ రిజర్వాయర్ వరకు తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు శుక్రవారం రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, యువజనాభివృద్ధి, శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తగరపువలస వెంకటేశ్వర మెట్ట వద్ద తాగునీటి పైపు లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు 9 కోట్ల 80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్ ఏర్పాటు కు శంకుస్థాపన చేశారు. ముందుగా తగరపువలస నుంచి జివిఎంసి పరిధి మూడో వార్డు భీమిలి సెంటర్ వరకు దాదాపుగా ఐదు కిలోమీటర్ల వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తగరపువలస సెంటర్ లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నవరత్నాలు పేదలందరికి కార్యక్రమంలో భాగంగా టిడ్కో ఇళ్ల పట్టాలను మంత్రి అందించారు.ఈ సంద ర్భంగా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలీ నియోజకవర్గం లో జివిఎంసి పరిధిలోని 1,2,3 వార్డులు 23 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని 40 కోట్ల రూపాయలను సంక్షేమానికి కేటాయించామని అన్నారు. భీమిలి 1,2,3 వార్డులకు దాదాపుగా అభివృద్ధి, సంక్షేమానికి 63 కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహించటం జరిగిందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అవుతున్న తరుణంలో

భీమిలీ నుంచి భోగాపురం వరకు 6లైన్స్ రోడ్ల నిర్మాణం జరగ నుం దని దీంతో మరింత భీమిలీ నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన తట్టుకోలేని ప్రతిపక్ష చంద్రబాబు మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు.

సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రతి పథకం అందించటంలో అర్హత ఉందా లేదో చూసి అందిస్తున్నామని.. గత ప్రభుత్వాలగా పార్టీ, కులం , చూసి ఇవ్వటం లేదని పేర్కొన్నారు. ఒక నూతన



అధ్యాయం లాగా ప్రతి ఇంటికి నాణ్యమైన రేషన్ బియ్యం డోర్ డెలివరీ కోసం రేషన్ సరుకుల రవాణా ట్రక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, ధర్నాలతో చంద్రబాబు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

మహాయజ్ఞం లాగా గత నెల 25 నుంచి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇది నిరంతరం కొనసాగుతుందని. అర్హత ఉన్న ప్రతి ఒక్కొక్కరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ భీమిలి జోనల్ కమిషనర్ సి హెచ్ గోవింద రావు, జి వి ఎం సి ఎస్ ఇ వేణుగోపాలరావు,రెండవ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థిని చిల్ల సరళా రాణి కరుణాకర్ రెడ్డి, మూడవ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థిని మైలపల్లి భారతి షణ్ముఖ రావు, నాలుగవ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి డి కొండబాబు, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడితబోయిన రాములప్పుడు, వైసీపీ ప్రధాన కార్యదర్శి జీరు వెంకట్ రెడ్డి, ఎ.రామునాయుడు, సి.హెచ్ .భాస్కర్ రెడ్డి, కొప్పు ల. రమేష్ వాసుపల్లి కొండబాబు, గుండాసు. మదునాయుడు, ప్రచార కమిటీ అధ్యక్షుడు పిన్నింటి ఎర్రయ్య రెడ్డి , కొండ్రు రామసూరప్పుడు, సి హెచ్. గౌరి నాయుడు, జి.సన్యాసిరావు యువజన అధ్యక్షుడు డింగి హరి కిరణ్ రెడ్డి, ఆర్.ప్రభాకర్ నాయుడు, సి హెచ్ వంశీ రెడ్డి,డి దుర్గా రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మిలీనియల్స్ అవసరమైన సాంకేతికతతో టెక్నో కేమన్

విశాఖపట్నం: సాంకేతికతకు పెద్ద పీట వేసే మిలీనియల్స్ అవసరాలకు అనుగుణంగా టెక్నో కేమన్ 16 ప్రీమియర్ను డిజైన్ చేశామని నిర్వాహకులు చెప్పారు.

ఈ తరం యువత తమ స్మార్ట్ ఫోన్లను ప్రధానంగా ప్రొఫెషనల్ నాణ్యతతో కూడిన ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఉపయోగిస్తున్నారన్నారు. టెక్నో కేమన్ 16 ప్రీమియర్ ఈ సెగ్మెంటులో మొట్టమొదటి స్మార్ట్ ఫోన్ కెమెరా అన్నారు. 64 ఎంపీ క్వాడ్ కెమెరాతో పాటు 48 ఎంపీ+8ఎంపీ డ్యూయల్ ఫ్రంట్ సెల్ఫీకెమెరా సెట్టింగులు ఉండటం పరిశ్రమలోనే ఒక విప్లవమన్నారు. అత్యధిక కెమెరా పిక్సెల్స్ అందించాయని, ప్రీమియం ఏఐ సామర్థ్యం ఉన్న అల్ట్రా నైట్ లెన్స్, పాపప్ కెమెరాలతో కేమన్ 16 ప్రీమియర్ ఇప్పుడు ప్రీమియం స్మార్ట్ఫోన్ వీడియోగ్రఫీని సంపూర్ణంగా మారుస్తుందని చెప్పారు.

# కవి సమయం

## శ్రమయే దైవం

పల్లె, పేటలు మనవే...
ఏరు, దుక్కులు వనదే...
ఏమిరో... శ్రమించు నోళ్ళు;
పనులకు పోండ్రో...
కాడెద్దులుతోను
గరువును దున్ని
నాగలి పట్టి
సాలును పూసి
పారిన ఏరుకు గూడ
తారెలు తవ్వి తోవ
మీ చెమటే... జలము
మీ శ్రమయే... ఘనము
శ్రమతో కార్మిక-చలి చలి గున్న
శ్రమతో ధార్మిక-మండే యెండలు వున్న
ఎత్తిన బంగీ-దించిన బంగీ
ఓర్మితో శ్రమలే...
కార్ఖాన పనులే...
నలుదిక్కులులోను
నలుమూలలులోను,
శ్రమ పావనమే - కనిపిస్తుంది
ప్రపంచానికే-శ్రమయే మేలనిపిస్తుంది

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం

మాసం : పుష్య ; తిథి : దశమి రా.7.43; కృత్తిక రా.8.50; వ.ఉ.7.33ల 9.19. | శనివారం 23 -01 -2021

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ులు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కొంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.


j **మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.

# శేషనయనా... అనంత పద్మనాభ

సంకీర్తన





శ్రీ మహావిష్ణువు 108 దివ్యదేశాల్లో అత్యంత ముఖ్యమైన క్షేత్రం తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం. పాలకడలిలో శేషపాన్పుపై పవళించిన ఆ చిద్విలాసమూర్తి మహారూపాన్ని ఇక్కడ వీక్షించవచ్చు. పద్మాన్ని నాభి యందు కలిగిన వాడు కాబట్టే ఆ పురుషోత్తముడిని పద్మనాభుడిగా పిలుస్తాం. శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయంలో వెలువడిన సంపద యావత్ ప్రపంచదృష్టిని ఆకర్షించింది. లక్షల కోట్లు విలువచేసే సంపదతో స్వామివారు ప్రపంచంలోనే అత్యంత ఐశ్వర్యమూర్తిగా అవత రించారు. అనంతమంటే అంతు లేనిదని అర్థం. అంత సంపదను వందల సంవత్స రాలుగా ఆలయంలో నిక్షిప్తం చేసుకున్న ఆ స్వామి నిజంగా అనంతుడే. లోకంలో సంభవించే విపత్తులను అడ్డుకునేందుకు ఆ పరంధాముడు పలు అవతారాలు ఎత్తి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేశాడు. ఆర్తితో పిలిస్తే భక్తులను ఆదుకుంటారు. అనంత మైన ఆ పరమాత్ముడు స్వయంగా వెలసిన క్షేత్రమే శ్రీఅనంత పద్మనాభక్షేత్రం.

**స్వామిని పూజించిన బలరాముడు**

ఈ ఆలయ ప్రస్తావన పలు పురాణాల్లో, ఇతిహాసాల్లో వుంది. బలరాముడు ఆలయాన్ని సందర్శించి పూజలు చేసినట్టు శ్రీమద్ భాగవతం తెలుపుతోంది. స్వామివారి మహత్యాన్ని పేర్కొంటూ 12 మంది ఆళ్వా రుల్లో ఒకరైన నమ్మాళ్వారు అనేక రచనలు చేశారు. కలియగం ప్రారం భమైన రోజున ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి నట్టు తెలుస్తోంది. అయితే ఈ ఆలయ చరిత్రపై కచ్చితమైన సమాచారం లేదు. వేల సంవత్స రాల నుంచి ఆలయం నిత్యపూజలు అందు కున్నట్టు ఆలయానికి చెందిన రికార్డులు వెల్లడిస్తున్నాయి.

**అనంతశయన మహత్య**

అనంతపద్మనాభుడు ఎలా ప్రత్యక్షమయ్యాడు అన్న దానిపై అనంతశయన మహత్య గ్రంథం వివరాలను తెలుపుతోంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం దివాక రముని అనే విషు? భక్తుడు వుండేవాడు. నిత్యం విష్ణునామ సంకీర్తనతో ఆయన నిమగ్నమయి వుండేవాడు. ఒకరోజు భగవానుడు ఆయనకు బాలుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. ముద్దులొలికే ఆ పిల్లవాడిని చూసిన దివాకరుడు తన నివాసంలో వుండాలని కోరాడు. అయితే ఆ పిల్లవాడు సాక్షాత్తు పరమాత్ముడే అన్న అంశాన్ని ముని గుర్తించలేకపోయారు. దీనిపై స్పందించిన చిన్నారి తాను చేసే పనులకు ఎలాంటి అడ్డుచెప్పకూడదని ఒకవేళ చెబితే వెళ్లిపోతానని నిబంధన పెడుతాడు. కొన్నిరోజులకు పిల్లవాడు చేసే అల్లరి ఎక్కువయింది. ఒకనాడు ముని తపోదీక్షలో వుండగా సాలగ్రామాలను తీసుకువచ్చిన స్వామి అతని నోటిలో వేస్తాడు. దీంతో మునికి తపోభంగమైంది. పిల్లవాడిపై పట్టరాని కోపం ప్రదర్శిస్తాడు. పిల్లవాడు వెంటనే అద ృశ్యమవుతూ తనను తిరిగి చూడాలంటే అనంతన్‌కాడు దగ్గరకు రమ్మని చెబుతాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే తన నివాసంలో బాలుడిగా వున్న అంశాన్ని దివాకరముని గుర్తిస్తాడు. వెంటనే స్వామిని అన్వేషిస్తూ సముద్రతీరప్రాంతానికి చేరుకుంటాడు. అక్కడ వున్న భారీ వ ృక్షం నేలపై పడి శ్రీమహావిషు?వుగా రూపాంతరం చెందింది. స్వామివారు భారీ రూపంగా దర్శనమిచ్చారు. అనంతుని దర్శనంతో అమితానందం చెందిన దివాకరముని అంతటి పెద్ద రూపాన్ని వీక్షించలేనని ప్రార్థించడంతో యోగదండం కంటే మూడింతలు పెద్దగా మారిపోయారు. స్వామిని కనులారా వీక్షించిన ముని స్వామికి ఒక టెంకాయలో మామిడికాయను వుంచి ప్రసాదంగా ఇస్తారు. ఇప్పటికీ ఈ పూజా విధానం ఆలయంలో కొనసాగుతుండటం విశేషం. ఈ క్షేత్రానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యంలో వుంది. నంబూద్రి సన్యాసి వివమంగళ స్వామియార్ అనే విష్ణు భక్తుడికి కూడా అనంతుడు ఇలానే దర్శనమిచ్చినట్టు తెలుస్తోంది.

**మూలవిరాట్టును మూడు ద్వారాల్లో నుంచి దర్శించాలి**

స్వామివారి మూలవిరాట్టును ఒక ద్వారం నుంచి మనం వీక్షించలేం. పెద్ద విగ్రహం కావడంతో తలను, చేతిని, పాదాలను వేర్వేరు ద్వారాల నుంచి వీక్షించాలి. రాజా మార్తాండవర్మ పాలనా సమయంలో వేల సాలగ్రామాలతో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టిం చారు. ఆ రోజుల్లో 4వేల శిల్పకారులు, 6వేలమంది కార్మికులు, నూరు ఏనుగులు ఆరు నెలల పాటు శ్రమించి ఆలయంలోని పలు కళాకృతులను ఏర్పాటుచేసినట్టు తెలుస్తోంది.

# గెమ్మెలి పిహెచ్‌సి లో విధులకు హాజరుకాకుండా

## డుమ్మాకొడుతున్న మెడికల్ ఆఫీసర్ ఐశ్వర్య

జి.మాడుగుల (పాడేరు) : మండలం గెమ్మెలి పంచాయతీ పరిధిలో గెమ్మెలి పిహెచ్‌సి వైద్యులు హాజరు కాకపోవడంతో అక్కడ ప్రజలు తీవ్రగాఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ప్రాంతమైన గెమ్మెలి పిహెచ్‌సి ఆ ప్రాంత వాసులకు ఆ ఒక్కటే దిక్కు కానీ వారానికి ఒక సారి కూడా వైద్యులు హాజరు కారు.అలాంటి పరిస్థితుల్లో మండల కేంద్రమైన జి మాడుగుల హాస్పిటల్ కి రావడం తప్ప వేరే మార్గం లేదు కానీ అక్కడ నుండి రావడానికి వారు పడే కష్టాలు అంత ఇంత శ్రమ కాదు రోడ్డు సదుపాయం సరిగ్గా లేక అంబులెన్స్ సమయానికి అందుబాటు లేక అక్కడ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు పోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. అయినా పట్టించుకోని వైద్యులు ఇంతకు ముందు పాడేరు ప్రాజెక్ట్ అధికారి డా. వెంకటేశ్వర్ రెండుసార్లు వెళ్లి తనిఖీలు నిర్వహించిన అప్పటికీ దాన్ని లెక్కచేయకుండా విధులకు హాజరుకాకపోవటం డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.గెమ్మెలి పి హెచ్ సి లో 26 వేల మంది జనాభా ఉన్నారు హాస్పిటల్ కి రోజు ఓపి సంఖ్య 20 నుంచి 25 వరకు ఉంటుంది అయినప్పటికీ వారికి సకాలంలో వైద్యం చేయడంలో డాక్టర్ అందుబాటులోకి ఉండటం లేదు. ఇప్పటికైనా డాక్టర్ అక్కడే ఉండి సకాలంలో వైద్యం అందేలా చూడాలని అక్కడ ప్రజలు అధికారులను కోరుతున్నారు.



# నేడు పెదనందిపల్లి సత్యనారాయణస్వామి తీర్థం



దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో శనివారం విజయ వెంకట సత్యనారాయణ స్వామి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్తరాంధ్ర జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ తీర్థానికి వేలాది మంది భక్తులు తరలి రానున్నారు.

ఈ సందర్భంగా....

గ్రామంలో అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు, బండ్ల వేషాలు నిర్వహించనున్నారు. పెదనందిపల్లి గ్రామ శివారు కొండపై సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని స్థానిక ఎస్ఐ పి.సింహాచలం పరిశీలించారు. ట్రాఫిక్ ఆంక్షలు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు.

# ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం



అచ్యుతాపురం : ప్రభుత్వ పాఠశాలలకు నాడు - నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అన్నారు . శుక్రవారం యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యంలో మండలంలో బదిలీపై వచ్చి కొత్తగా విధులలో చేరిన ఉపాధ్యాయులను సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని , సిపియస్ రద్దు చేయాలని, పే రివిజన్ కమిటి సిపార్స్ మేరకు తక్షణం పిఆర్ సి అమలు చేయాలని కొరారు.

ఈ కార్యక్రమంలో....

యుటిఎఫ్ జిల్లా మహిళ కన్వీనర్ కె సుభాషిణిదేవి, మండల శాఖ అధ్యక్షులు నిడదవోలు శ్రీనివాస్ రాజు, జిల్లా నాయకులు జి ఎస్.ప్రకాష్ తదితరులు అన్నారు.

# 59వార్డులో ఇంటింటా రామమందిర నిధి సమర్పణ



ములగాడ : ఆయోధ్యలో రామమందిర నిర్మాణం నిధి సమర్పణ భాగంగా శుక్రవారం 59వ డివిజన్ శాంతి గిరి కాలనీ లో బీజేపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి పాలిమేర హరిత ఆధ్వర్యంలో ఇంటింటా నిది సమర్పణ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలిమేర హరిత మాట్లాడుతూ నిధి సమర్పణలో పాల్గొన్న కుటుంబ సభ్యులకు ఆ శ్రీరాముని ఆశీస్సులు ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నామని, అలాగే ప్రతి భారతీయుడు అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో....

బీజేపీ విశాఖ పార్ల మెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీనివాస రావు, పాలిమేర ఉమా దేవి, కొత్తలంక భువనేశ్వరి, పూడి లావణ్య లు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ సహకారముతో

# దివ్యాంగులకు బుక్స్ పంపిణీ



పరవాడ : నేషనల్ దర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపిసి)సామాజిక కార్యక్రమంలో బాగంగా సింహద్రి ఎన్టీపిసి తమ వంతు సాయం అందిస్తుంది. ఎన్టీపిసి సౌజన్యముతో దీపికా లేడిస్ క్లబ్ సభ్యులు అచ్చుతాపురం మండలము కొండకర్ల గ్రామంలో గల ఇచ్చాఫౌండేషన్ లో అశ్రమం పొందుతున్న దివ్యాంగులుకు నోట్ బుక్స్ మరియు స్టేషనరీ కిట్స్ అందజేసి వారికి ఎన్టీపిసి చేయూతగా నిలిచింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా క్లబ్ ప్రెసి డెంట్ సిమాకౌశిక్ వైస్ ప్రెసిడెంట్ రేష్మికౌశ్కిలు హజరై వీళ్ళు చేతులుమిదగా దివ్యాంగులుకు అందజేశారు. అనంతరము క్లబ్ ప్రతినిథిలు మాట్లడుతూ సామాజిక బాధ్యతలో బాగంగా ఎన్టీపిసి పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది అని భవిష్యత్ లో మరిన్నీ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్దంగా ఉంది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో దీపికా లేడిస్ క్లబ్ సభ్యులు తథితర్లు పాల్గోన్నారు.

# చీకటి ఒప్పందంతో పంచాయతీ కాలువ నిర్మాణం

**- పర్యవేక్షణ లేని ఇంజనీరింగ్ శాఖ - అధికార పార్టీ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం**

పాడేరు : ఏజెన్సీమండల కేంద్రమైన హుకుంపేట నడిబొడ్డున ప్రధాన రహదారికి ఆనుకొని పంచాయతీ కాలువ నిర్మాణం చేపట్టేందుకు 30 లక్షల రూపాయల కాంట్రాక్టు దక్కించుకున్న అధికార పార్టీ జడ్పిటిసి అభ్యర్థి రేగం మత్యలింగం అరకు శాసనసభ్యులు శెట్టి పాల్గుణ తనఅనుచరులతో నిర్మాణం చేపట్టారు. అధికార పార్టీ వారు కావడంతో ఇంజనీరింగ్ శాఖ వారి పర్యవేక్షణ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో కాలువ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా పనులు చేపట్టడం జలుగుతుంది. నాణ్యత లోపంతో పనులు చేపట్టడంతో స్థానిక ప్రజలు ప్రశ్నించే ధైర్యం లేక గుసగుసలు ఆడుకోవడం. విశేషం.. పగలంతా నిర్మాణ పనులు చేయకుండా రాత్రి చీకటిలో లైట్లు వేసి పనులు చేయడం వెనక ఆంతర్యం ఏమిటో తెలియని విషయం. దీంతో కాలువ పనుల్లో నాణ్యత లేకుండా చేస్తున్నారు. అధికారులు పట్టించుకునే పరిస్థితి ఉందా? లేదా అనేది ఒకప్రశ్న. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ శాఖ జరుగుతున్న పనుల్లో నాణ్యత ఉందా లేదా అనేది తేల్చాలని ఆ ప్రాంత ప్రజలు కోరు కొంటున్నారు.



# కౌమార బాలికల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం



గాజువాక : కౌమార బాలికల ఆరోగ్యమే దేశ సౌభాగ్యంమని సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-2 ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. ఈ నెల 24న జరపనున్న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురష్కరించుకొని "కౌమార బాలికల ఆరోగ్యం"పై సెయింట్ ఆన్స్ కళాశాలలో ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సదస్సులో ముఖ్యవక్తగా వై.అనసూయాదేవి పాల్గొని మాట్లాడుతూ గత 5సం. నుంచి యునిసెఫ్ సౌజన్యంతో కౌమార బాలల సాధికారత పై జాతీయ సేవా పథకంలో అనేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, బాలల అక్రమరావాణా, బాలలపై జరుగుతున్న హింస, బాలల హక్కుల ఉల్లంఘన, తదితర అంశాలపై ఆమె ప్రసంగించారు. బేటీ బచావో, బేటీ పడావో, బాలికలు చదువుకోవలసిన ఆవశ్యకత, పౌష్టికాహారం అవసరం గురించి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ.పి.యస్. భాగ్యలక్ష్మి ప్రసంగించారు.

అనంతరం జరిగిన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యునిట్-3ప్రోగ్రాం అధికారిణి వి. అంజలీదేవి, అధ్యాపకులు, కౌమార బాలికలు పీర్‌లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు అచ్యుతాపురంలో వాలీబాల్ పోటీలు

అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురంలో నేడు (శనివారం) శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా ఆలయం దగ్గర మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . పోటీలు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ప్రధమ బహుమతి 8 వేలు , ద్వితీయ బహుమతి 6 వేలు , తృతీయ బహుమతి 4 వేలు ,ఆటగాళ్లకు మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటివారు తెలిపారు. వివరాలకు 9908660879 నెంబరుకు సంప్రదించాలన్నారు.

# జగదాంబ వద్ద చారిత్రక డచ్ సెమెట్రీని పరిశీలించిన కమిషనర్



విశాఖపట్నం : విశాఖ నగరంలో ప్రఖ్యాతి గాంచిన జగదాంబ జంక్షన్ ప్రాంతంలోగల చారిత్రిక నేపథ్యం ఉన్న డచ్ సెమెట్రీ స్థలాన్ని జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన కార్పోరేషన్ ఉన్నతాధికారులతో పరిశీలించారు. 1.30 ఎకరాల పరిధిలో గల ఈ సెమెట్రీ ఒక ఆదర్శవంతమైన పార్కుగా తీర్చిదిద్దడానికి తగు ప్రణాళిక రూపొందించాలని, వెంటనే సెమెట్రీ నందు పేరుకుపోయిన పొదలను, చెత్తను త్వరితగతిన తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడ నుండి, కమిషనర్ మూడవ జోన్ నందుగల వారసత్వ భవనాలైన పాత టౌన్ హాలు మరియు పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలో విశాఖ వారసత్వాన్ని ప్రతిబింబించేలా చేపడుతున్న పలు పనులపురోగతిని పరిశీలించారు. ముఖ్యంగా, ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్ ఇంజనీరును ఆదేశించారు. ఈ పర్యటనలో జివిఎంసి ప్రధాన ఇంజనీరు ఎం.వెంకటేశ్వర రావు, చీఫ్ సిటీ ప్లానర్ విద్యుల్లత, పి.డి.(యు.సి.డి.) వై. శ్రీనివాస రావు, ఎ.డి.హెచ్. ఎం. దామోదర రావు, పర్యవేక్షక ఇంజనీర్లు రాజా రావు, వినయ కుమార్, కార్య నిర్వాహక ఇంజనీర్లు మెహెర్ బాబా, సుధాకర్, ఎ.సి.పి. అమ్మాజీతదితరులు పాల్గొన్నారు.





విశాఖ దక్షిణ నియోజకవర్గం 31వ వార్డు చాకలి పేట లో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన టి.రామారావు అనే వ్యక్తికి స్థానిక నాయకులతో కలిసి అంతిమ సంస్కారాలు నిర్వహించిన వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి బత్తిన నాగరాజు

### అరకు పార్లమెంట్ (టిఎన్ఎస్ఎఫ్) అధ్యక్షులు

# తమర్ల సత్యనారాయణను అరెస్టు చేసిన పాడేరు ఎస్ఐ

పాడేరు : జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలని కోరుతూ ఈ రోజు అమరావతి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి ముట్టడికి పిలుపునిచ్చిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఏపీ సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడికి వెళ్లకుండా ఉండేం దుకు ముందస్తు జాగ్రత్త చర్యగా అరకు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్అధ్యక్షులు.తమర్ల. సత్యనారాయణను పాడేరు ఎస్ఐ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లో హౌస్ అరెస్టు చేశారు. టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు తమర్ల సత్యనారాయణతో పాటు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ కుమార్. కూడా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని విద్యార్థుల సమస్యలపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి గిరిజన బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పై ప్రేమ ఉంటే వెంటనే 77 జీవోను రద్దు చేయాలని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు ప్రభుత్వమే భరించాలని ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# ఈనెల 25న జిల్లా ఉపాధి ఉద్యోగ మేళా




కంచరపాలెం : వరుణ్ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం సంస్థకు సంబందించి ఐ.టి.ఐ కూడలి వద్ద నున్న జిల్లా ఉపాధి కార్యాలయం (టెక్నికల్) లో ఈనెల 25 ఉద్యగా మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారికి (టెక్నికల్) కె.సుధా శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు మెకానిక్, ఎలక్ట్రిక్షన్, పెయింటర్ 60 పోస్టులకు సంబంధించి ఉద్యగా మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఐటిఐ పూర్తి చేసిన డిజిల్ మెకానిక్, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రిసియస్, మోటర్ మెకానిక్ & ఏసీ, ఎల్ఎంవి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు వయస్సు 20 నుండి 30 మగ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 25 వ తేదిన నిర్వహించనున్నాన మౌఖిక పరీక్షకు తమ దృవ పత్రాలతో హాజరు కావలని కోరారు. మరన్ని వివరాలకు Varun. vkp.hrd@ marutidealers.com వెబ్సైట్ లో సంప్రదించాలని సూచించారు.

### గంగులగెడ్డలో పూడిక తీయకపోవడంతో

## స్థానిక ప్రజలు పలు అనారోగ్యలతో బాధ పడుతున్నారు

*31వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి మరియు వార్డు అధ్యక్షులు దొడ్డి బాపు ఆనంద్*



విశాఖపట్నం : గత ఆరు నెలలుగా సూర్యబాగ్ ప్రాంతంలో ప్రవహించు గంగుల గెడ్డలో పూడిక తీయకపోవడంతో స్థానిక ప్రజలు పలు అనారోగ్యలతో బాధ పడుతున్నారని స్థానిక 31 వార్డ్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి మరియు వార్డ్ అధ్యక్షులు దొడ్డి బాపు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. అయన మాట్లాడుతూ, కరోన వ్యాధి కాలంలో పారిశుధ్య కార్మికులను ఇబ్బంది పెట్టకూడదని స్థానిక ప్రజలు అభ్యర్థన కూడా ప్రక్కన పెట్టి ఒకటి రెండు సార్లు స్థానికుల సహకారంతో శుభ్రం చేశామని, టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్త ఇప్పటికైనా జి వి ఎం సి అధికారులు దృష్టి పెట్టి తక్షణం శుభ్రం చేయాలని అధికారులను కోరారు. వార్డ్ టీడీపీ కమిటీ సభ్యుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి రోజు తిరిగే బాపు ఆనంద్, స్థానిక సూర్యబాగ్ మహిళలతో మాట్లాడుతూ, త్వరలోనే పూడిక తీయిస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో భాగంగా వార్డ్ కార్యదర్శి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు కర్రి ధనలక్ష్మి, నాయ కులు లక్ష్మణ్, నవీన్, వార్డ్ మహిళలు కుమారి, సునీత, నారాయణమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరిని వైయస్సార్ బీమా పథకంలో చేర్చాలి

గొలుగొండ : అర్హులైన వారిని వైయస్సార్ భీమా పథకంలో చేర్చాలని గొలుగొండ ఎంపిడిఒ డేవిడ్రాజు సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ యజమాని మరణిస్తే వైఎస్సార్ బీమా పథకం కుటుంబానికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబ యజమానులు ఈ పథకానికి అర్హులని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకం కింద సహజ మరణం సంభవిస్తే రెండు లక్షల రూపాయలు, ప్రమాదంలో మృతి చెందితే ఐదు లక్షల రూపాయల బీమా పరిహారం బాధిత కుటుంబానికి అందుతుందన్నారు. వైఎస్సార్ బీమా పథకంలో చేరేందుకు బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలన్నారు.



ఎంపిడిఒ డేవిడ్రాజు

### ఎస్ఓఎస్ లో చిల్డర్న్ విలేజ్ లో

## మంత్రి తనయుడు ముత్తంశెట్టి శివ నందీశ్ పుట్టినరోజు వేడుకలు



భీమునిపట్నం: అనాధ పిల్లలకు పండ్లు పంపిణీ చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు.మంత్రి తనయుడు ముత్తంశెట్టి శివ నందీశ్ పుట్టిన రోజు సందర్భంగా భీమిలీ లో ఉన్న ఎస్ ఓ ఎస్ లో చిల్డర్న్ విలేజ్ లో ఉన్న అనాధ పిల్లలతో కుటుంబ సమేతంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్ లను, పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస రావు మాట్లా డుతూ ముత్తంశెట్టి శివ నందీశ్ జన్మదిన వేడుకలు అనాధ ఆశ్రమంలోని పిల్లల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. బాగా చదువుకొని సమా జానికి మార్గదర్శకంగా ఉండటమే కాకుండా ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మంత్రి విద్యార్థు లకు, చిన్నారులకు చెప్పారు. మంచి వాతా వరణం లో ఎస్ ఓ ఎస్ సంస్థ నెలకొల్పి పేద, అనాధ, విద్యార్థిని విద్యార్థులకు విద్యను అందించటం సంతోషకరమన్నారు. ప్రతి సంవ త్సరం నా పుట్టిన రోజు మీతో జరుపు కుంటు న్నానని ఈ సంవత్సరం నుండి కూడా మా అబ్బాయి మీతో పుట్టిన రోజు జరుపుకుంటారని తెలియజేశారు.

# తగరపువలస లో టీడీపీ నాయకులు నిరసన



భీమునిపట్నం : జీవీఎంసీ భీమిలి జోన్ 1,2,3,4 వార్డులు మరియు ఆనంద పురం, పద్మనాభం మరియు భీమిలి రూరల్ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో తగరపువలస జంక్షన్ లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబెడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోరాడ రాజబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మో హన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయిన దగ్గరనుండి ఆరాచక పాలన సాగుతుందని అన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కి పోలీస్ వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.ప్రశ్నిస్తే అరెస్ట్, నిలదీస్తే దౌర్జన్యం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటయి నేటివరకు ఎటువంటి అభివృద్ధి చేయకపోగా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు మీద తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు.రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత డా.బి.ఆర్.అంబెడ్కర్ సిగ్గుపడేలా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పనితీరుందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని నికృష్టం ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేని ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వాటికి సంబంధం లేని కేసులో ఇరికించి అరెస్ట్ చేయడంలో మాత్రం దేశంలోనే రాష్ట్రం ముందుందని గంటా నూకరాజు అన్నారు. అసలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదా అనే సందేహం వస్తుందని అన్నారు. ఎక్కడ అయినా తప్పు జరిగితే అక్కడకు వెళ్లిన ప్రతి పక్ష నాయకులపై కేసులు పెడతారు. మీలాగే గత అధికారంలో ఉండేటప్పుడు చేసి ఉంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 3వేల కిలోమీటర్లు పాదయాత్ర ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసి ఉండేవార అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడవలసిన అవసరం పాలకులపై ఉందని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తగదని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి రూరల్ అధ్యక్షుడు డి.ఏ.ఎన్. రాజు, భీమిలి జోన్ 1వ వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, 2వ వార్డు అధ్యక్షులు బడిగంటం నీలకంఠం, 4వ వార్డు అభ్యర్థి గరికిన కింగ్, చిలకా నర్సింగరావు, మాజీ జెడ్.పి.టి.సి. సరగడ అప్పారావు, మాజీ ఎమ్.పి.టి.సి. పాసి నర్సింగరావు, ఎస్.సి.సెల్ అధ్యక్షులు రవ్వ వెంకటరావు ,తెలుగు యువత నాయకులు శివాజీ, బోను సురేష్, పిట్టా సురేష్, గరికిన కింగ్, కారి అప్పారావు, కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీ శ్వరరావు, కనకల అప్పలనాయుడు, దాసరి వెంకటేష్, గండిబోయిన పోలిరాజు, అప్పికొండ నూకరాజు, సిద్దార్ధ్ వర్మ, ఊళ్ళ దుర్గారావు, కనక రాజు, పిల్లా రాజేష్, పిల్లా తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రాముని శోభాయాత్ర

గాజువాక: బీజేపీ కన్వీనర్ కర్ణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో శ్రీరాముని శోభా యాత్ర ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం గాజువాక ప్రధాన కూడలి వద్ద జబర్దస్త్ నటులు రమేష్ జెండా ఊపి ప్రారంబించారు. అయోధ్య శ్రీ రామజన్మభూమి మందిర నిర్మాణ నిధి సమర్పణ ఉద్యమంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో శోభాయాత్ర నిర్వహించారు. కొత్త గాజువాక నుంచి మొదలైన యాత్ర కోలాటాలు,భజనలు,సాంస్కృతిక ప్రదర్శనలతో ముందుకు సాగింది. జై శ్రీరామ్...జైజై శ్రీరామ్ అంటూ శ్రీరామ నామ స్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ ఈ సందర్భంగా శ్రీ రామ చంద్రునికి సేవ చేసే మహత్తర అవకాశం భారతదేశంలోని విదేశాలలో నివసిస్తున్న రామ భక్తులకు, ఆధ్యాత్మిక స్ఫూర్తి ప్రధాతలు ముఖ్యంగా హిందువులందరికీ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ కు ప్రజలందరి తరపున భారతీయ జనతా పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామ జన్మభూమి మందిర నిర్మాణం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుంది అని అన్నారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత,ఎందరో భక్తుల త్యాగాల నేపథ్యంలో అయోధ్య శ్రీరాముడు జన్మించిన స్థలంలో భవ్య మందిర నిర్మాణానికి ఆగస్ట్ 5, 2020 న మన దేశప్రధాని నరేంద్రమోడీ పరిపాలనలో శంకుస్థాపన చేసి హిందువుల కలను సాకారం చేసారని అన్నారు. ఈ మహత్తర ఉద్యమంలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కుల మత వర్గాలకు , పార్టీలకు అతీతంగా మందిర నిర్మాణ నిధి సమర్పణ ఉద్యమంలో పాల్గొనాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాజాపా మహిళా మోర్చా రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ప్రేమకుమారి,66వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి డాక్టర్ గొర్లె సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణమరాజు,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బాటా శ్రీనివాస్ , కో కన్వీనర్లు గూటూరు శంకర్రావు, నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గోలి శంకర్రావు, 72వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సిరసపల్లి .నూకరాజు, 88వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి దాడి నూకరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు వర్రి లలిత, 79వ వార్డు అధ్యక్షులు తాతారావు, 85వ వార్డు అధ్యక్షులు సత్తిబాబు, విశ్వహిందూపరిషత్ నాయకులు జీలకర్ర రమణ, మహిళా మోర్చా నాయకులు జీలకర్ర భువనేశ్వరి, రమనమ్మ, 86వ వార్డు ప్రదాన కార్యదర్శి కృష్ణం రాజు ,64వ వార్డు ప్రదాన కార్యదర్శి పేర్ల.అప్పారావు, అమ్మ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు బాస్కర్, సెక్రటరీ అయ్యలనాయుడు, కళాకారుల సంఘం నుండి మాస్టర్ బాలు, రాజు, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.



# అన్నవరం లో ఘనంగా ఇళ్ళ పట్టాల పంపిణీ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజగవర్గం శంఖవరం మండలం అన్నవరం గ్రామంలో నవరత్నాలు లో భాగంగా నిరు పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా.గీత విశ్వనాథ్, మరియు ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణ చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ శెట్టిబత్తుల కుమార్ రాజా అద్యకృత వహించారు.ఈ సందర్భంగా ఎంపీ వంగా.గీత విశ్వనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం భాగంగా శుక్రవారం శంఖవరం మండలం అన్నవరం గ్రామంలో 1,150 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించామని అలాగే పార్టీ లకు అతీతంగా అర్హులైన వారు అందరికీ ఇళ్ళ పట్టాలు ఇవ్వడం జరిగింది అని తెలియజేశారు.అలాగే ఎమ్మెల్యే పర్వత.పూర్ణ చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అన్నవరం గ్రామంలో మా పర్వత కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలు కార్యక్రమాలు అర్హులైన అందరికి అమలు చేయడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వాలంటీర్లు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో
# 'రెడ్ క్రాస్' బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు



విశాఖపట్నం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చీఫ్ జనరల్ మేనేజర్, మిస్.షబ్నం నారాయణ్, స్టెడ్ అస్సెట్స్ రిజల్యూషన్ గ్రూప్, కార్పొరేట్ సెంటర్ ముంబాయి వారు సూచనల ప్రకారం దేశంలోని అన్ని స్టెడ్ అస్సెట్స్ రిజల్యూషన్ గ్రూప్ (SARG) బ్రాంచిల యందు స్థానిక బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడమైనది.

ఈ ప్రక్రియలో భాగంగా విశాఖ పట్నం సార్చ్ (స్టెడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి) వారి ఆధ్వర్యంలో శు క్రవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో "రెడ్ క్రాస్" బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్.బి.ఐ. విశాఖపట్నం రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ శ్రీ.కె.రంగరాజన్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించినారు.ఈ సందర్భంగా రంగరాజన్ గారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒక మనిషి ప్రాణాన్ని నిలపడానికి ఎంతగానో ఉపయోగ పడుతుందనీ, ఎన్నో ప్రాణాలను సైతం కాపాడవచ్చుననీ పేర్కొన్నారు. అందరూ రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతను నిలుపు కోవాలని కోరారు. కార్యక్రమంలో సార్చ్, విశాఖపట్నం ఎ.జి.ఎం. కె.శ్రీకిరణ్ మాట్లాడుతూ ఈ రోజు ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందదాయకంగా ఉందనీ, ఈ ప్రక్రియలో పాల్గొనడం పట్ల తమ సిబ్బంది చూపిన చొరవ పట్ల హర్షం వ్యక్తం చేసారు. అలాగే ఈ రక్తదాన శిబిరం యందు తమ ఉద్యోగులతో పాటు మొత్తం 87 మంది రక్తదానం చేసారన్నారు. ప్రమాద సమయంలో తల్లి కన్నీళ్ళు తమ బిడ్డ ప్రాణాన్ని నిలుపలేదని, మీరు ఇచ్చే రక్తం మాత్రమే ప్రాణాన్ని నిలబెడుతుందని అన్నారు. ఈ రోజుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయనీ, ప్రమాద సమయంలో రక్తం ఎక్కువగా కోల్పోయి ప్రాణాలు సైతం విడిచిన సందర్భాలు ఉన్నాయనీ, వారికి సకాలంలో రక్తం అందించి వాళ్ళ ప్రాణాలను కాపాడుతున్న మరియు రక్తదానం చేసిన మీరంతా "సూపర్ హీరోస్" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, ఇతర బ్యాంక్ సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు రక్తదానంలో పాల్గొన్న వారందరికీ తమ కృతజ్ఞతలు తెలియజేశారు.



# మైసూర్‌లో అత్యాధునిక పెయింట్ తయారీ కర్మాగారం
## డిజిటల్ ఇండియా దృష్టిని ఆకర్షిస్తున్న ఏషియన్ పెయింట్స్

విశాఖపట్నం : ప్రముఖ బహుళజాతి పెయింట్, అలంకరణ సంస్థ ఏషియన్ పెయింట్స్, డిజిటల్ ఇండియా దృష్టిని ఆకట్టుకోవడం ద్వారా కొత్త రియాలిటీని నావిగేట్ చేస్తోంది. అభివృద్ధి మార్గంలో వెళ్ళే క్రమంలో సంస్థ రెండు హైటెక్ ప్లాంట్లను స్థాపించింది. పెయింట్ పరిశ్రమలో మైసూర్, విశాఖపట్నంలో రెండు మెగా ప్లాంట్లను ఏర్పాటు చేసిన ఏషియన్ పెయింట్స్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్‌తో వైర్‌తో పాటు వైర్‌లెస్ టెక్నాలజీలతో నడుస్తుంది. అంతర్నిర్మిత కార్యాచరణ ప్రక్రియలు, సామర్థ్యాలు శ్రామికశక్తికి బలమైన అభ్యాస వేదికను నిర్మిస్తాయి. తద్వారా వారి ఉన్నత స్థాయికి సహాయపడతాయి.

'మేక్ ఇన్ ఇండియా' లో భాగంగా అత్యాధునిక ఆవిష్కరణ ద్వారా దిగుమతులను తగ్గించడం..

స్థానికులను ప్రోత్సహించడం జరగనుంది. అందువల్ల ఈ రెండు ప్లాంట్లలో స్మార్ట్ మెషిన్లు వినూత్న ప్రక్రియలతో, ఏషియన్ పెయింట్స్ పెయింట్ పరిశ్రమలో ఒక మార్గదర్శక బాధ్యతాయుతమైన బ్రాండ్‌గా తనను తాను నిరూపించుకుంది.

# ఘనంగా అమర్ జన్మదిన వేడుకలు



అనకాపల్లి : ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు స్ధానిక రింగ్‌రోడ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున రక్తదాన శిభిరం నిర్వహించారు. పేదలకు దుప్పట్లు వస్త్రాలు పంపిణీ చేసారు. జాజుల రమేష్ ఆద్వర్యంలో రక్తదానం చేసారు. ముఖ్య అతిధిగా డాక్టర్ రామ్మూర్తి హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో జానకిరామరాజు మాట్లాడుతూ చిన్నతనంలోనే రాజకీయాలలో రాణించిన అమర్‌నాధ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని, అన్నారు. అనకాపల్లి అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి విస్మరించలేనిదన్నారు. 500 కోట్లతో మెడికల్ కాలేజీ చిరస్ధాయిగా నిలిచిపోతుందన్నారు. తండ్రిని మించిన తనయుడుగా పేరుతెచ్చుకోవడం విశేషమన్నారు. వచ్చే ఏడాది పెద్ద పదవి ఆయనకి రావాలని ఆకాంక్షించారు. అలాగే జి. రామ్మూర్తి మాట్లాడుతూ తండ్రి బాటలో నడుస్తున్న అమర్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు కరోనా వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. ఆయన నాయకత్వంలో రానున్న స్ధానిక ఎన్నికలలో అఖండ విజయం సాదించడం జరుగుతుందని చెప్పారు.

పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈసంవత్సరం జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే హొదాలో చేసుకున్న అమర్‌నాధ్ వచ్చే ఏడాది మంత్రి హొదాలో చేసుకోవాలని, ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొణతాల మురళీ, భాస్కర్, జాజుల రమేష్, వినకోట రాజాన సతీష్, గైపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



# పలకా ఆధ్వర్యంలో అమర్ జన్మదిన వేడుకలు



అనకాపల్లి : స్థానిక శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్ జన్మదినం సందర్భంగా రింగ్‌రోడ్‌లోని సీతారామ కళ్యాణ మండపంలో పలకా రవి మిత్రమండలి ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనాయకులు సమక్షంలో కేక్ కట్ చేయడం జరిగింది. రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కార్యదర్శి పలకా రవి.84 వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి పలకా యశోద ఆద్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గుడివాడ అమర్‌నాధ్ చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. అలాగే పలకా రవి ఆద్వర్యంలో 84 వ వార్డులో రానున్న కార్పోరేట్ ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలుపు సాదించడం కాయమన్నారు. ఈసందర్భంగా 103 మంది రక్తధానం చేసారు. ఈసందర్భంగా అభినందన పత్రాన్ని డాక్టర్ రామ్మూర్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిధి గా. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మసాలా కిషోర్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేశారు. విశాఖ చెందిన ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో 100 మంది యువకులు ఈ రక్తదాన శిబిరంలో యువకులు అందర్నీ సర్టిఫికెట్ తో సత్కరించారు పాల్గొన్నారుఈ కార్యక్రమంలోవైసిపి నాయకులు. పలకా వరలక్ష్మి. పాలమరశెట్టి మురళీకృష్ణ, సకలా గోవిందరావు, విల్లూరు శివ సూరి. పీల్లా రాంబాబు. కోరుకొండ రాఘవ. యల్లపు చంద్రమోహన్. బొడ్డేడ శివ. సూరి శెట్టి రమణ అప్పారావు.దాడి నారాయణరావు. గాలి శ్రీనివాసరావు. శఠగోపం కుమార్. కోటిపల్లి జేజి బాబు. మొగలి పల్లి సుబ్బారావు. కోడూరు త్రినాథ్ రావు. నారాయణరావు. మార్కండేయులు. పలకా రవి మిత్ర మండలి సభ్యులు. 84 వ వార్డు వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సత్యదేవుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారిని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ చిక్కాల. రామచంద్రరావు కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆరై భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో ఓడిఎఫ్ అమలుకావాలి : జిల్లా కలెక్టర్ జె.నివాస్



శ్రీకాకుళం : గ్రామ వాలంటీర్ల సహకారంతో జిల్లాలో పూర్తి స్థాయిలో ఓ.డి.ఎఫ్ ( వ్యక్తిగత మరుగుదొడ్లు ) అమలయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఓ.డి.ఎఫ్, వర్మికంపోస్టు, ఇంటిపన్నుల వసూలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లతో పాటు అదనంగా కావలసిన మరుగుదొడ్లపై సర్వే చేయడం జరిగిందని, అటువంటి వారికి మరుగుదొడ్లను మంజూరుచేయడం జరిగిందని తెలిపారు. అలాగే గతంలో మరుగుదొడ్లు మంజూరుకాబడి బిల్లుల చెల్లింపులు జరగక ఆగిపోయిన 20 వేల మరుగుదొడ్లను కూడా పూర్తిచేసి జిల్లాలో పూర్తిస్థాయిలో ఓ.డి.ఎఫ్ అమలయ్యేందుకు కృషిచేయాలని యం.పి.డి.ఓలను కోరారు. జిల్లాలోని లావేరు, నందిగాం, టెక్కలి, సీతంపేట, సంతబొమ్మాళి, పలాస మండలాల్లో ఓ.డి.ఎఫ్ వెనుకబడి ఉండటంపై ఆరాతీసిన ఆయన త్వరలోనే వాటిని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మనం - మన పరిశుభ్రతలో భాగంగా మొదటి, రెండవ విడతల్లో ఎంపికచేసిన గ్రామాల్లో పూర్తిస్థాయిలో వర్మికంపోస్టును తయారుచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కొన్ని కేంద్రాల్లో 27 వేల కేజీల వర్మికంపోస్టును విక్రయించి లక్ష రూపాయలు ఆదాయం ఆర్జించిన యం.పి.డి.ఓలను కలెక్టర్ అభినందిస్తూ,ఇదేతరహాలో మిగిలిన యం.పి.డి.ఓలు కూడా పెద్దస్థాయిలో వర్మికంపోస్టులను తయారుచేసి విక్రయించి ఆదాయాన్ని తీసుకురావాలని కోరారు. ఫేజ్-2లో కొత్తగా 316 వర్మికంపోస్టుల తయారీ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, వాటిని మరింత మెరుగుపరచేందుకు కృషిచేయాలని కలెక్టర్ కోరారు. అలాగే మరామ్మతులకు గురికాబడిన వర్మికంపోస్టులపై దృష్టిసారించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని యం.పి.డి.ఓలను ఆదేశించారు. ఇంటి పన్నుల వసూలుపై యం.పి.డి.ఓలతో మాట్లాడిన ఆయన వీలైనంత త్వరగా మొండి బకాయిలను వసూలుచేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ ఉండాలని, అటువంటి వారికి మాత్రమే జీతాలు మంజూరుచేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సచివాలయాల ఆకస్మిక తనిఖీల్లో సిబ్బంది లేరనే విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇకపై అటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రతీ సచివాలయానికి వచ్చే రోజువారీ దరఖాస్తుల వివరాలను సంబంధిత యం.పి.డి.ఓలు తెప్పించుకొని ఎప్పటికపుడు వాటిని పరిష్కారం చేయాలని సూచించారు.

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముందని, అందుకు యం.పి.డి.ఓలు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఎన్నికలు నిర్వహించవలసివస్తే అందుకు అవసరమైన ఆర్.ఓల జాబితాను సిద్ధం చేసుకొని శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఆర్.ఓలుగా ఎంపికైనవారు ఎన్నికల ప్రవర్తన నియమావళిని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎటువంటి అనుమానాలు లేకుండా నివృత్తి చేసుకోవాలని చెప్పారు. మండలానికి అవసరమైన బ్యాలెట్ బాక్సులు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా తదితర వివరాలను ముందుగా సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి బి.లక్ష్మీపతి, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఏర్పాట్లు గావించాలి

- ఈ-ఎపిక్ గూర్చి ఓటర్లకు అవగాహన కలిగించాలి
- పెండింగ్ లో ఉన్న క్లైంలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి
- ఆర్ఓ, ఇఆర్ఓలను ఆదేశించిన జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్




విశాఖపట్నం : జాతీయ వాటర్ల దినోత్సవం నాటికి కోవిడ్ నిబంధనలతో ఏర్పాట్లు గావించాలని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ లో జాతీయ ఈ నెల 25 వ తేదీన వోటర్ల దినోత్సవ ఏర్పాట్లపై ఆయన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన నిర్వహించబోయే 11వ జాతీయ ఓటర్ల దినోత్సవంను కోవిడ్-19 నిబంధనలు పాటిస్తూ పోలింగ్ స్టేషన్లు, శాసన సభ నియోజక వర్గాల వారీగా నిర్వహించాలని, కొత్త ఓటర్లగా నమోదైన వారిని, వృద్ధ ఓటర్లను సన్మానించవలసినదిగా ఆదేశించారు. ఎన్నికల సంఘం కొత్తగా ఈ నెల 25వ తేదీన ప్రారంభించనున్న ఇ-ఎపిక్ గూర్చి ఓటర్లలో అవగాహన పరచాలన్నారు. వారి యొక్క మొబైల్ నుండ కాని వారి యొక్క ఎపిక్ నంబర్ నమోదు చేసి ఇ-ఎపిక్ పొందునట్లు అవగాహన పరచాలన్నారు. జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలోను, ప్రతి కార్యాలయంలలోను డౌన్లోడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పెండింగ్ క్లైయిములన్ని ఈ నెల 31వ తేదీ నటికి పూర్తి చేయవలసినదిగా ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల ప్రకారం తే 01.02.2021 నుండి 10.02.2021 దీ వరకు జిల్లా ఉన్న ఇవిఎం లను భౌతికంగా తనిఖీ చేయుటకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతకు ముందు ఈ నెల 25వ తేదీన నిర్వహించబోయే 11వ జాతీయ ఓటర్ల దినోత్సవంపై రాష్ట్ర ఎన్నికల కమీషనర్ విజయానంద్ జిల్లా కలెక్టర్లు, జిల్లా జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోవిడ్-19 నింబంధనలతో జాతీయ ఓటర్ల దినోత్సవంను నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లు, శాసన సభ నియోజక వర్గాల వారీగ నిర్వహించాలని, వృద్ధ ఓటర్లు, ఓటర్లుగా కొత్తగా నమోదైన వారిని సన్మానించాలన్నారు. ఇ-ఎపిక్ పై ఓటర్లలో అవగాహన పరచాలని చెప్పారు. పెండింగ్ లో క్లైయిములను ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఇవిఎంలను భౌతికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్,జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. ప్రసాద్, ఉప కలెక్టర్లు రంగయ్య, ఎస్.డి. అనిత, పద్మలత, విశ్వేశ్వరరావు, ప్రమీల గాంధీ, ఎనక్షన్ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే గుడివాడ అమర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కె.కె.రాజు



మింది : శుక్రవారం అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమరనాధ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసం మిందిలో కలిసి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా శాలువా తో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాస్,కె.అనిల్ కుమార్ రాజు, కె.సతీష్,శ్రీధర్ రెడ్డి,రెయ్యి వెంకట్ రమణ,పైడి శ్రీను, నీలి రవి, కె.పి రత్నాకర్ పాల్గొన్నారు.



*కశింకోట వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాధ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.*

# అంబేద్కర్ వర్సిటీ వీసీకి అభినందన

## ఏయూ వీసీ ప్రసాద రెడ్డి



ఆంధ్రాయూనివర్శిటీ : అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన ఏయూ విద్యా విభాగం విశ్రాంత ఆచార్యులు నిమ్మ వెంకట రావును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సత్కరించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిమ్మ వెంకట రావును అభినందించారు. సుదీర్ఘ అనుభవం, పరిపాలనా అనుభవం కలిగిన వెంకట రావు అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వీసీగా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాద రెడ్డిని మర్యాద పూర్వకంగా అంబేద్కర్ వర్సిటీ వీసీ నిమ్మ వెంకట రావు సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అఖిలప్రియకు బెయిల్ మంజూరు

హైదరాబాద్: బోయిన్‌పల్లి కిడ్నాప్ కేసులో ఏపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియకు బెయిల్ మంజూరైంది. ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు సికింద్రాబాద్ న్యాయస్థానం వెల్లడించింది. మరోవైపు ఆమె భర్త భార్గవ్ రామ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

అఖిలప్రియ సోదరుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి ముందస్తు పిటిషన్‌పై వాదనలు కొనసాగనున్నాయి. హఫీజ్‌పేటలోని భూవివాదం నేపథ్యంలో ప్రవీణ్‌రావు, సునీల్ రావు, నవీన్‌రావు అనే ముగ్గురు సోదరుల కిడ్నాప్‌పై బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

# జిల్లాకు తలమానికం కథానిలయం

## తెలుగుభాషా, సంస్కృతి కమిటీ ఛైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్



శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లాకు తలమానికంగా కథానిలయం నిలుస్తుందని శాసనమండలి తెలుగుభాషా, సంస్కృతి కమిటీ ఛైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం విశాఖ ఎ కాలనీలో గల కాళీ పట్నం రామారావు గారి కథా నిలయాన్ని శాసన మండలి తెలుగు భాషా సంస్కృతి కమిటీ సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ, కథలన్నింటినీ ఒకే చోట పొందుపరచే మహాయజ్ఞాన్ని చేపట్టిన కాళీపట్నం రామారావు మాస్టారి ప్రయత్నం అభినందనీయమన్నారు. కథా రచయితగా, సాహితీవేత్తగా, కథల అభిమానిగా కథలను సేకరించి ఒకే చోట పొందుపరచడం ఒక మంచి ప్రక్రియ అని అన్నారు. ఇప్పటివరకు లక్ష కథలను సేకరించడం అందులో సుమారు డెబ్భై శాతం కథలు డిజిటలైజ్ చేయడం చాలా ఆనందదాయకమన్నారు. నిస్వార్థ సాహిత్య సేవకు ఇది ఒక నిదర్శనమన్నారు. కథానిలయాన్ని సందర్శించాలనే కుతూహలంతోనే శ్రీకాకుళం జిల్లాని పర్యటించడం జరిగిందన్నారు. గ్రంథాలయాలను విజ్ఞాన భాండాగారాలన్నారు. గ్రంథాలయాల ద్వారా పిల్లలు తెలుగు భాష, సాహిత్యాలను అలవరచుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితిలో గ్రంథాయాల పరిస్థితి చాలా హీనస్థితిలో వున్నాయన్నారు. కనీసం కరెంట్ బిల్లును కట్టుకోలేని దుస్తుతి చాలా దారుణమన్నారు. మున్సిపాలిటీ, పంచాయితీలు వసూలు చేసే గ్రంథాలయ సెస్సును గ్రంథాలయాల నిర్వహణకు వుపయోగించుకోవాలన్నారు. కథానిలయంలో రచయితల ఫోటోలను కూడా వుంచడం వారికి ఇచ్చిన గౌరవానికి నిదర్శనమని అన్నారు. కథానిలయానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని ఆయన తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సుమారు 9, 10 సం.ల క్రితం తాను శ్రీకాకుళం సందర్శించడం జరిగిందని, అప్పటికి కారా మాస్టారు సుమారు 40 నుండి 50 వేల కథలను సేకరించడం జరిగిందన్నారు. ఈ రోజు పర్యటనలో ఒక లక్ష వరకు కథలను సేకరించడం ఒక అద్భుత విషయమన్నారు. తెలుగు సాహిత్య ప్రక్రియలో కథకు మంచి స్థానం వుందన్నారు. మన కథలు ప్రపంచానికి తెలియచేయాలన్నారు. కథానిలయానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలన్నారు. కథానిలయం స్ఫూర్తితో రాజమండ్రిలో నాటకనిలయం స్థాపన జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కవితలు, నవలలు, జీవిత చరిత్రలు, శాసనాలు ఒకే చోట చేర్చే అవకాశాలుంటాయన్నారు. ప్రభుత్వం నుండి సాయం అందాల్సి వుందని, సాంకేతిక అభివృద్ధి మరింత సాధించి ప్రపంచంలోనే మంచి గుర్తింపు రావాలన్నారు. పరిశోధకులకు చాలా వుపయోగకరమన్నారు. తెలుగు కథలను ఇతర భాషలలోకి తర్జుమా చేసి మన కథలను పలు భాషాభిమానులు ఆస్వాదించాలన్నారు. ప్రభుత్వం నుండి స్థలాన్ని మంజూరు చేయడానికి కృషి చేస్తామన్నారు. కమిటీ సభ్యులు కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని పునరుద్ధరించుకోవాలన్నారు. నెల్లూరులో నెల్లూరి పిల్లోడి కథలను చిన్న పిల్లలతో వ్రాయించడం జరిగిందన్నారు. వారి భాష తిక్కన కవి భాషను గుర్తుకు తెచ్చాయన్నారు. తెలుగు కథలను పిల్లతో తయారు చేయించి వారిలో సాహిత్య అభిలాషను పెంపొందించాలన్నారు. కమిటీ సభ్యులు పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ, కథా నిలయానికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వ పరంగా అందించే చర్యలు చేపడతామన్నారు. నిధుల లేమితో వార్షికోత్సవాలను నిర్వహించుకోలేకపోవడం చాలా బాధాకరమన్నారు. కథలను డిజిటలైజేషన్ చేసి నిక్షిప్తం చేయడం హర్షదాయకమన్నారు. కథలకు చిరునామా శ్రీకాకుళంగా రూపొందాలన్నారు. ముందుగా కాళీపట్నం రామారావు గృహానికి మండలి కమిటీ వెళ్ళి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ డిప్యూటీ కార్యదర్శి జి.విజయరాజు, ఇంటాక్ కన్వీనరు కె.వి.జె.రాధాప్రసాద్, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి ఎన్.నారాయణ రావు, సహాయ పర్యాటక అభివృద్ధి అధికారి రమేష్, కలెక్టరేట్ డిప్యూటీ తహశీల్దార్ సతీష్, కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్ర రావు, కార్యవర్గ సభ్యులు అట్టాడ అప్పల నాయుడు, ట్రెజరర్ కాళీపట్నం సుబ్బారావు, తదితరులు హాజరైనారు.

# రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనాలను ప్రారంభించిన కె కె రాజు







అక్కయ్యపాలెం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికీ రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనం ద్వార అందిం చాలని డిపోలకు వెళ్లి పడికాపులు పడకుండ కష్టాలు పడకుండా ఇంటికొచ్చే విధానాన్ని తీసుకొస్తూ రేషన్ డోర్ డెలివర్ వాహనాలు పథకం ప్రారంభించిన శుభ సందర్భంగా శుక్రవారం విశాఖ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తరనియోజవర్గ సమన్వ యకర్త కె కె రాజు 44,49వార్డుల సంబంధించిన వాహనాలు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాస్,ఆళ్ళ శివగణేష్ ,కిరణ్ రాజు,చల్ల ఈశ్వరరావు, కట్టమూరి సతీష్,అల్లు శంకర్రావు,నీలి రవి,రత్నాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్తగా 137 కరోనా కేసులు..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. గడచిన 24 గంటల్లో 48,313 కరోనా పరీక్షలు నిర్వహించగా, 137 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య 886694కి చేరింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. వ్యాక్సినేషన్ విధుల్లో 7 లక్షల మంది కోవిడ్ బారినపడి గడచిన 24 గంటల్లో అనంతపురం, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నంలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం నలుగురు మరణించగా, ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనాతో మృతిచెందిన వారి సంఖ్య 7146కి చేరింది. గడచిన 24 గంటల్లో కోవిడ్ నుంచి కోలుకుని 167 మంది క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 8,78,060 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఏపీలో ప్రస్తుతం 1,488 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. నేటివరకు 1,27,87,961 శాంపిల్స్‌ను పరీక్షించారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com